మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...


నేటి
# ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక


మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..


సోమవారం MONDAY 16-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 228 Issue: 228

16 ఫిబ్రవరి 2026 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:45 సూర్యాస్తమయం - సా. 6:14 తిథి చతుర్దశి సా. 5:30 వరకు తరువాత అమావాస్య సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం శ్రవణ రా. 8:36 వరకు తరువాత ధనిష్ఠ యోగం వారియ రా. 1:41ం వరకు కరణం శకుని సా. 5:30 వరకు చతుష్పాద తె. 5:36ం వరకు వర్జ్యం రా. 12:52 నుండి రా. 2:30 వరకు దుర్ముహూర్తం మ. 12:53 నుండి మ. 1:39 వరకు మ. 3:10 నుండి మ. 3:56 వరకు రాహుకాలం ఉ. 8:12 నుండి ఉ. 9:38 వరకు యమగండం ఉ. 11:04 నుండి మ. 12:30 వరకు గుళికాకాలం మ. 1:56 నుండి మ. 3:22 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:09 నుండి తె. 5:57 వరకు అమృత ఘడియలు ఉ. 9:57 నుండి ఉ. 11:37 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:53 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com




# మొక్కంటికి మొక్కులు

మహాశివరాత్రి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునుంచే భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలోని భీమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.

## వైభవంగా మహాశివరాత్రి వేడుకలు.. తెలుగు రాష్ట్రాల్లోని ఆలయాల్లో రద్దీ

### వేములవాడ, శ్రీశైలానికి తరలిన భక్తులు.. శ్రీకాళహస్తిలో అధికారులపై ఆగ్రహం

(ఈవార్తలు న్యూస్ నెట్‌వర్క్)

శనివారం సాయంత్రం టీటీడీ పట్టువస్త్రాల సమర్పించగా, ఆదివారం ఉదయం 8 గంటలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాల సమర్పించారు. సాయంత్రం ఘనంగా లింగార్చన జరిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం మహాశివరాత్రి శోభను సంతరించుకుంది. తెలంగాణతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. త్రివేణి సంగమ గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, గోదావరి తల్లికి తరువాయి 2 వ పేజీలో...



# 38 దేశాలతో ట్రేడ్ డీల్స్

## రాజకీయ స్థిరత్వంతోనే సాధ్యం: మోదీ

న్యూఢిల్లీ: తమ పాలనలో రాజకీయ స్థిరత్వం కారణంగానే 38 దేశాలతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోగలిగిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తయారీ, సేవా రంగం, ఎంఎస్ఎంఈ విభాగాల్లో మన దేశం బలంగా ఉండడం ట్రేడ్ డీల్స్ మనకు అనుకూలంగా మార్చుకోగలిగామని తెలిపారు. ప్రముఖ వార్తా సంస్థ పీటీఐకి ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ అనేక అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఇటీవలి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల గురించి వెల్లడించారు. 'రాజకీయ స్థిరత్వం, అంచనాలు పెట్టుబడిదారుల్లో భారత్‌పై నమ్మకం పెంచాయని' ప్రధాని మోదీ స్పష్టం తరువాయి 2 వ పేజీలో...

# ఉగ్ర ఖాతాలకు ఉచ్చు



## 8 వేల దొంగ బ్యాంక్ అకౌంట్లు బ్లాక్

### కశ్మీర్ కేంద్రంగా డిజిటల్ హవాలా.. విజయవంతంగా ఛేదించిన ఎన్ఐఏ



జమ్ము కశ్మీర్ కేంద్రంగా సైబర్ నేరగాళ్లు నిర్వహిస్తోన్న 'డిజిటల్ హవాలా' వ్యవస్థను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఛేదించింది. అంతర్జాతీయ స్కామ్ సిండికేట్‌లతో సంబంధం ఉన్న దాదాపు 8వేలకు పైగా నకిలీ బ్యాంక్ ఖాతాలను బ్లాక్ చేసింది.

కశ్మీర్/న్యూఢిల్లీ: సైబర్ మోసాలతో దోచుకున్న డబ్బును వేర్పాటువాద, ఉగ్ర కార్యకలాపాలకు వినియోగించే ప్రమాదం ఉందని అధికారులు అనుమానిస్తున్నారు. వివిధ దర్యాప్తు సంస్థలతో కలిసి మూడేళ్లగా చేస్తున్న విచారణతో ఈ డిజిటల్ హవాలా వ్యవస్థ బట్టబయలయ్యింది. అక్రమ ఆర్థిక లావాదేవీలపై జమ్మూ కశ్మీర్ పోలీసులతోపాటు కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రత్యేకంగా దృష్టి పెడుతుండడంతో.. కొన్నేళ్లుగా నగదు అక్రమ రవాణాకు నేరగాళ్లు కొత్త పద్ధతులను అనుసరిస్తున్నట్లు తేలింది. సాధారణ హవాలా మార్గాలకు బదులు 'డిజిటల్ హవాలా'ను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. అనేక సందర్భాల్లో సాధారణ పౌరుల గుర్తింపు కార్డులను ఉపయోగించి షెల్ కంపెనీల పేర్లతో నకిలీ ఖాతాలు తెరుస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వీటి ద్వారా రోజుకు రూ.లక్షల్లో డబ్బును ఇతర ఖాతాలకు మళ్లిస్తున్నట్లు వెల్లడైంది. బ్యాంకు అధికారులకు ఎలాంటి అనుమానం తరువాయి 2 వ పేజీలో...






# దాయాదిపై దంచేశారు!

## టీ20 ప్రపంచకప్‌లో భారత్ గ్రాండ్ విక్టరీ

### 61 పరుగుల తేడాతో పాక్ చిత్తు

### ఇషాన్ కిషన్ ధనాధన్ బ్యాటింగ్

టీ20 ప్రపంచకప్‌లో దాయాది పాకిస్తాన్‌తో జరిగిన హైవోల్టేజ్ మ్యాచ్‌లో మరోసారి భారత్ జయకేతనం ఎగురవేసింది. దాయాది దేశాన్ని మరోసారి భారత్ 61 పరుగుల తేడాతో చిత్తుచేసింది. ఐసీసీ టోర్నీలో మరోసారి పాకిస్తాన్‌పై తిరుగులేని రికార్డును కొనసాగించింది. ఈ టీ20 వరల్డ్ కప్‌లో టీమిండియా వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసి గ్రూప్-లో నుంచి సూపర్-8లోకి ప్రవేశించింది.

..పూర్తి వివరాలు క్రీడావాణిలో..



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,775 |
| వెండి (గ్రాము): | రూ.280 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,006 |

# నల్లమలలో సేవాలాల్ పుణ్యక్షేత్రం

## పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతాం.. సేవాలాల్ జయంతి వేడుకల్లో రేవంత్



నల్లమల అటవీ ప్రాంతంలో బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ పుణ్యక్షేత్రాన్ని నిర్మిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. వచ్చే ఏడాది సేవాలాల్ జయంతి ఉత్సవాలను అక్కడే నిర్వహించుకునేలా, గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా అత్యద్భుతంగా పుణ్యక్షేత్రాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు.

## విశ్వవాణి



ఈఫిల్ టవర్‌ను విక్రయించడం అనేది చరిత్రలోనే అత్యంత విచిత్రమైన, తెలివైన మోసాల్లో ఒకటిగా నిలిచిపోయింది. దీనిని 1925లో విక్టర్ లుస్టిగ్ అనే అంతర్జాతీయ మోసగాడు ఒకసారి కాదు, ఏకంగా రెండుసార్లు అమ్మేశాడు. అయినా పోలీసులు పట్టుకోలేకపోయారు. అయితే, దొంగ నోట్ల కేసులో పట్టుబడి అమెరికాలో కటకటాల పాలయ్యాడు.

# కరీంనగర్.. ఉత్కంఠ!

## దోబూచులాడుతున్న మేయర్ పీఠం

### కాంగ్రెస్‌లో చేరిన స్వతంత్ర కార్పొరేటర్లు

కరీంనగర్ కార్పొరేషన్ విషయంలో బీజేపీకి బిగ్ షాక్ తగిలింది. బీజేపీకి మద్దతిచ్చిన స్వతంత్ర కార్పొరేటర్లు తూచ్ అన్నారు. ఇద్దరు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్పొరేటర్లతో పాటు, ముగ్గురు స్వతంత్ర కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కరీంనగర్, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి విజయం సాధించిన కార్పొరేటర్లు సాయిజ్యోతి, శ్యామలతో పాటు స్వతంత్ర కార్పొరేటర్లు కొమరయ్య, నందిని ఉదయ్, మల్లేశం తదితరులు హస్తం గూటికి చేరారు. కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు మీడియాతో -2 వ పేజీలో...



# పంతం నెగ్గిన జీవన్ రెడ్డి!

### కాంగ్రెస్ జెండా మోసినోళ్లకే చైర్‌పర్సన్ పదవి

## ఎమ్మెల్యే సంజయ్-జీవన్ రెడ్డి మధ్య సంధి!

జగిత్యాల/హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపల్ పీఠంపై నెలకొన్న సందిగ్ధతకు ఫుల్‌స్టాప్ పడినట్ల కనిపిస్తోంది. జగిత్యాల మున్సిపల్ పీఠాన్ని కాంగ్రెస్ జెండా మోసిన వ్యక్తికే ఇవ్వాలని పార్టీ నాయకత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌లతో సంధి కుదిర్చిన తర్వాత పార్టీ నాయకత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. వీరిద్దరితో -2 వ పేజీలో...

# కౌన్సిలర్ల ఇళ్లకు పోలీసులా?

## హంగ్ మున్సిపాలిటీల కోసం అరాచకం

### ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): రాష్ట్రంలో ఇటీవల ఎన్నికలు జరిగిన మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడిన 34 చోట్ల అధికారాన్ని చేజిక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. కౌన్సిలర్లను కిడ్నాప్ చేయడం, -2 వ పేజీలో...



# నేడు చైర్మన్లు, మేయర్ల ఎన్నిక

### టీపీసీసీ చీఫ్‌తో సీఎం జూమ్ మీటింగ్

### ఎన్నికలపై దిశానిర్దేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రులు, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో జూమ్ మీటింగ్ నిర్వహించారు. రాష్ట్రంలో ఇటీవలే మున్సిపల్ ఎన్నికలు పూర్తవ్వగా.. మేయర్లు, చైర్మన్ల ఎన్నికలపై సీఎం దిశానిర్దేశం చేశారు. సోమవారం చైర్ పర్సన్లు, మేయర్ల ఎన్నిక -2 వ పేజీలో...

## రాశి ఫలాలు

16.2.2026

మేషం: చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు తప్పవు. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. గృహ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఖర్చులు పెరుగుతాయి. నూతన ఋణయత్నాలు చేస్తారు. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేయవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి.

వృషభం: ప్రయాణాలు జాగ్రత్తగా వ్యవహరించాలి. కీలక విషయాలలో శ్రమపడ్డా ఫలితం లభించదు. ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహపరుస్తాయి. మిత్రులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు స్వల్పంగా లభిస్తాయి. ఉద్యోగాలలో మీ విలువ మరింత పెరుగుతుంది.

మిథునం: ఆత్మీయుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. మంచి మాట తీరుతో ఇంటా బయట అందర్నీ ఆకట్టుకుంటారు. చేపట్టిన పనులు నూతనోత్సాహంతో పూర్తి చేస్తారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. వ్యాపార ఉద్యోగాలలో మీ శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. ఆదాయ మార్గాలు పెరుగుతాయి.

కర్కాటకం: ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. కొత్త పనులకు శ్రీకారం చుడతారు. ఆర్థికంగా అనుకూల వాతావరణం ఉంటుంది. కొన్ని వ్యవహారాలలో ఆకస్మికంగా నిర్ణయాలు మార్చుకుంటారు. ధార్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో మీ అంచనాలు నిజం కాగలవు.

సింహం: వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చేయటం మంచిది. ఇంటా బయట పరిస్థితులు అనుకూలించవు. చేపట్టిన వ్యవహారాలలో ప్రతిబంధకాలు ఉంటాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. గృహ వాతావరణం చికాగ్గా ఉంటుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి, ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి.

కన్య: ఆర్థిక వాతావరణం గందరగోళంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో కష్టపడ్డా ఫలితం ఉండదు. కుటుంబ సభ్యులతో వివాదాలు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. గృహమును కొందరు ప్రవర్తన వలన మానసిక సమస్యలు కలుగుతాయి. ఉద్యోగాలలో ఇబ్బందికర వాతావరణం ఉంటుంది.

తుల: కీలక వ్యవహారంలో అందరిని ఒక మాట మీదకు తీసుకువస్తారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆర్థిక ఇబ్బందులు అధిగమిస్తారు. నూతన వాహన యోగం ఉన్నది. వ్యాపారాలు కొంత సామాన్యంగా సాగుతాయి, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

వృశ్చికం: ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారించడం మంచిది. చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు కలుగుతాయి. బంధు మిత్రులతో మాటపట్టింపులు తప్పవు. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. ధన పరంగా ఇబ్బందులు తప్పవు. వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమవుతుంది.

ధనస్సు: సంతానం విద్యా విషయాలలో శుభవార్తలు అందుకుంటారు. నిరుద్యోగుల శ్రమ ఫలించి నూతన అవకాశాలు లభిస్తాయి. నూతన మిత్రుల పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. స్థిరాస్తి క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

మకరం: ధన పరంగా ఒడిదుడుకులు అధికమవుతాయి. ఊహించని ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. కుటుంబసభ్యుల నుంచి ఒత్తిడులు అధికమవుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వాయిదా పడతాయి. వృత్తి ఉద్యోగాల్లో అదనపు పనిభారం ఉంటుంది.

కుంభం: సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. వ్యాపారస్తులకు నూతన పెట్టుబడులు అందుతాయి. సమయానికి పనులు పూర్తి చేయగలుగుతారు. వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో అధికారుల సహాయ సహకారాలతో నూతన అవకాశాలు అందుకుంటారు.

మీనం: చేపట్టిన పనులలో జాప్యం కలిగినా నిదానంగా పూర్తి చేస్తారు. భూ సంబంధిత క్రయవిక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. వాహనాలు కొలత కలుగుతుంది. వ్యాపారాలలో భాగస్వామితో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఉద్యోగాలు గతం కంటే మెరుగైన వాతావరణం ఉంటుంది.







# మొక్కంటికి మొక్కులు

మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పట్టు వస్త్రాలు సమర్పించారు. కొమురవెల్లి మల్లన్న, అయినవోలు మల్లన్న ఆలయాలూ భక్తులతో కిటకిటలాడాయి. అటు ఏపీలోని ప్రముఖ దేవాలయం శ్రీశైలంలో భక్తుల రద్దీ కనిపించింది. వేకువజామున 4 గంటల నుంచే దర్శనాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం శివపార్వతులకు ప్రభోత్సవం నిర్వహించారు. రాత్రి 12 గంటలకు స్వామి-అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అయితే, శ్రీకాళహస్తిలో దర్శనం ఆలస్యం కావడంపై భక్తులు మండిపడ్డారు. వీఐపీల సేవలో అధికారులు తరిస్తున్నారని మండిపడ్డారు. ఇక, ద్రాక్షారామ,కోటిపల్లి శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. శివనామ స్మరణతో ద్రాక్షారామ శ్రీభీమేశ్వర స్వామి ఆలయం, కోటిపల్లి శ్రీ ఛాయా సోమేశ్వర వారి ఆలయాలు మార్మోగాయి.

# 38 దేశాలతో ట్రేడ్ డీల్స్

మొదటి పేజీ తరువాయి

చేశారు. ఇప్పటికే అమెరికా, ఈయూతోపాటు గల్ఫ్ కంట్రీస్‌తోనూ భారత్ ఎఫ్‌టీఏ కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. అంతకుముందు సైతం మరికొన్ని ఒప్పందాలు చేసుకుంది. త్వరలో 6 దేశాల గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)తో ట్రేడ్ డీల్ సైతం తుది దశలో ఉంది. ఇది పూర్తయితే గత కొన్నేళ్లలో 9 ఎఫ్‌టీఏల ద్వారా 38 దేశాలతో భారత్ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు అవుతుంది. దీని గురించే పీఎం మోదీ ప్రస్తావించారు. కాగా, యూపీఏ హయాంలో జరిగిన ఆర్థిక అవకతవకలు, అవినీతి కారణంగా కొన్నేళ్ల పాటు భారత్ ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని కలిగించలేకపోయిందని ప్రధాని విమర్శించారు. ఎన్‌డీఏ హయాం భారత్ సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దీనిని కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా ఆచరణలోనూ చూపిస్తోందని స్పష్టం చేశారు. ప్రైవేటు రంగం గురించి మాట్లాడుతూ.. మార్జిన్లను కాపాడుకోవడంపై తక్కువ దృష్టి పెట్టి, పరిశోధన, తయారీ సప్లయ్ చైన్, నాణ్యతపై ఎక్కువ పెట్టుబడి పెట్టాలని పీఎం సూచించారు. అదే సమయంలో లాభాలు పెరిగితే, వాటి ఫలాలను ఉద్యోగులు/కార్మికులతో పంచుకోవాలని చెప్పారు. 'వికసిత్ భారత్'కు తదుపరి అడుగు ఆవిష్కరణలు, దీర్ఘకాలిక సామర్థ్యం, పోటీ ప్రపంచంలో ప్రైవేటు రంగం చేసే సాహసోపేతమైన పెట్టుబడిపై ఆధారపడి ఉంటుందని ప్రధాని మోదీ అన్నారు. పెరుగుతున్న ముప్పు కారణంగా రక్షణ వ్యవస్థను మరింత ఆధునికీకరించాల్సిన అవసరముందని ప్రధాని పేర్కొన్నారు. ముఖ్యంగా లేటెస్ట్ టెక్నాలజీకి అనుగుణంగా ఆయుధ సంపత్తిని బలోపేతం చేయాలన్నారు. అందుకే కేంద్ర బడ్జెట్‌లో ఈ రంగానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చినట్లు ప్రధాని వివరించారు. 'వికసిత్ భారత్' సాకారం కావాలంటే రక్షణ రంగం కూడా బలంగా ఉండాలని ఆయన స్పష్టంచేశారు.

## కరీంనగర్.. ఉత్కంఠ!

మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతూ.. ' కరీంనగర్ అభివృద్ధి అధికార కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని బలంగా నమ్ముతున్నాము. అభివృద్ధి కాంక్షించి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నాము' అని అన్నారు. కాగా, శనివారం ఎంపీ బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన స్వతంత్ర కార్పొరేటర్లు ఆ పార్టీకి ఊహించని షాక్ ఇచ్చారు. బీజేపీకి హ్యాండ్ ఇచ్చి కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో మొత్తం 66 డివిజన్లు ఉండగా బీజేపీ 30, కాంగ్రెస్‌కు 14, బీఆర్ఎస్‌కు 9, ఎంఐఎంకు 3 దక్కాయి. ఫార్వర్డ్ బ్లాక్‌కు 2, స్వతంత్రులు 8 మంది విజయం సాధించారు. ఇక్కడ మేయర్ పీఠాన్ని సాధించాలంటే 35 మంది సభ్యుల బలం కావాలి. 30 సీట్లు సాధించి కరీంనగర్ కార్పొరేషన్ లో అతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ తమకే మేయర్ పీఠం దక్కుతుందని భావించింది. కానీ, స్వతంత్రులు కాంగ్రెస్‌లో చేరటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## పంతం నెగ్గిన జీవన్ రెడ్డి!

మొదటి పేజీ తరువాయి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఏఐసీసీ సెక్రటరీ సవాంగ్ చర్చలు జరపగా, అవి ఫలించాయనేది ప్రాథమిక సమాచారం. ఇరు వర్గాలకు నేతలు నచ్చచెప్పడంతో వారు మెట్టుదిగి వచ్చారని, ఈ క్రమంలోనే జెండా మోసిన వ్యక్తికు చైర్మన్ పదవి ఇవ్వాలని నిర్ణయానికి వచ్చారనేది విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. దీనిలో భాగంగా పార్టీ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉండాలని ఇరు వర్గాల నేతలకు నచ్చచెప్పారు. ఈ చైర్మన్ పీఠంపై జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌లు చెరో వర్గంగా విడిపోయారు వార తమ పంతాన్ని నెగ్గించుకోవాలని పట్టుబట్టుకుని కూర్చున్నారు. దీనిలో భాగంగా కాంగ్రెస్ జెండా మోసిన వ్యక్తికి మేయర్ పీఠం ఇవ్వాలని నిర్ణయానికి వచ్చింది అధి నాయకత్వం. ప్రత్యేకంగా ఎమ్మెల్యే సంజయ్‌ను ప్రజాభవన్‌కు పిలిపించుకుని మరీ చర్చలు జరిపారు. ఇది ఫలించడంతో జగిత్యాల ఎపిసోడ్‌కు దాదాపు ముగింపు పడినట్లే కనిపిస్తోంది.

# ఉగ్ర ఖాతాలకు ఉచ్చు

మొదటి పేజీ తరువాయి

రాకుండా ఉండేందుకు భారీ నగదును చిన్న మొత్తాల్లో విభజిస్తూ లావాదేవీలు చేస్తున్నారు. ఈ ఖాతాల ద్వారా అమాయకుల నుంచి దోచుకున్న డబ్బులను నిందితులు ఎప్పటికప్పుడు క్రిప్టోకరెన్సీ రూపంలోకి మార్చుతున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. ఇటువంటి హవాలా ఖాతాల కట్టడికి స్థానిక బ్యాంకులతో కలిసి పనిచేయాలని జమ్మూ కశ్మీర్ పోలీసులకు, ప్రభుత్వ విభాగాలకు ఎన్ఐఏ సూచించింది.

### మ్యూలర్ల కోసం గాలింపు

సైబర్ నేరాల గొలుసుకట్టులో ఈ 'మ్యూల్ అకౌంట్లు' అత్యంత కీలకమైనవని ఇన్వెస్టిగేటర్లు వివరిస్తున్నారు. దోచుకున్న సొమ్మును క్రిప్టోకరెన్సీ వంటి గుర్తుతెలియని డిజిటల్ ఆస్తులుగా మార్చడానికి ఈ ఖాతాలు నేరగాళ్లకు అనివార్యంగా మారాయి. ఈ ముప్పును అరికట్టేందుకు జమ్మూ కాశ్మీర్ పోలీసులతో పాటు ఇతర ఎన్ఫోర్స్‌మెంట్ సంస్థలు బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని కేంద్ర భద్రతా సంస్థలు ఆదేశించాయి. ఈ కుట్రలో మధ్యవర్తులుగా వ్యవహరించే 'మ్యూలర్స్'ను పట్టుకునేందుకు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. 2017లో అక్రమ నిధుల ప్రవాహంపై ఉక్కుపాదం మోపిన తర్వాత, దేశ వ్యతిరేక శక్తులు తమ పంథాను మార్చుకున్నాయని అధికారులు అనుమానిస్తున్నారు. మ్యూల్ అకౌంట్ హోల్డర్లు, మధ్యవర్తులు సంపాదించే కమీషన్లు జాతీయ భద్రతకు విఘాతం కలిగించే కార్యకలాపాలకు మళ్లించబడుతున్నాయని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఈ నెట్‌వర్క్‌లో 'మ్యూలర్' పాత్ర చాలా వ్యూహాత్మకమైంది. వీరు నేరుగా బాధితులను మోసం చేయరు కానీ,



స్కామర్లకు అవసరమైన బ్యాంకు ఖాతాలను నిరంతరం సరఫరా చేస్తుంటారు. సామాన్య ప్రజలను సులభమైన సంపాదన పేరుతో ఆకర్షించి, వారి ఆన్‌లైన్ బ్యాంకింగ్ వివరాలను సేకరిస్తారు. కేవలం పార్కింగ్ అకౌంట్లుగా మాత్రమే వాడుకుంటామని నమ్మించి, వారి ఖాతాలను మనీ లాండరింగ్‌కు కేంద్రాలుగా మారుస్తారు. ఒక్కో ఆపరేటర్ చేతిలో ఒకేసారి 10 నుండి 30 వరకు ఇలాంటి ఖాతాలు ఉంటున్నాయని దర్యాప్తులో వెల్లడైంది.

# నల్లమలలో సేవాలాల్ పుణ్యక్షేత్రం

బంజారాహిల్స్/హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం రోజున రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బంజారా భవన్‌లో జరిగిన సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ఆదివాసీలకు ఆదిలాబాద్‌లో నాగోబా దేవాలయం, మేడారంలో సమ్మక్క - సారలమ్మ పుణ్యక్షేత్రం ఉన్నట్టుగా బంజారాలకు ప్రత్యేక క్షేత్రం లేదని పేర్కొన్నారు. అందుకోసం నల్లమల అటవీ ప్రాంతంలో 20 ఎకరాల భూమిని ఇప్పటికే కేటాయించినందున, అక్కడ బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ప్రపంచంలోనే బ్రహ్మాండమైన పుణ్యక్షేత్రం నిర్మిస్తామని తెలిపారు. అంతేకాకుండా ఆ పుణ్యక్షేత్రాన్ని గొప్ప పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణలోని అన్ని తండాలు, గూడాలకు తప్పనిసరిగా బీటీ రోడ్డు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం స్పష్టమైన ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. మానవజాతి శాంతి మార్గంలో, చెడును విడిచి, భక్తితో సన్మార్గంలో నడవాలని బోధించిన సంత్ సేవాలాల్ దేశంలో 15 కోట్ల మంది గిరిజనులకు ఆదర్శప్రాయంగా నిలిచారని అన్నారు. అలాంటి మహనీయుని జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో, పునర్నిర్మాణంలో లంబాడా సోదరుల పాత్ర ఎవరూ మరువలేనిదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వారికి సంక్షేమం, అభివృద్ధి, ప్రభుత్వంలో సముచిత స్థానం, గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. 2006 నుంచి ఇప్పటివరకు ప్రతి సందర్భంలోనూ లంబాడా సోదరులు తనకు అండగా నిలబడ్డారని గుర్తు చేసుకున్నారు. ప్రతి తండాలో పాఠశాల భవనం, పంచాయతీ భవన నిర్మాణానికి స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తాగడానికి మంచినీరు, కరెంట్ అందించాలని... అటవీ ప్రాంతాల్లో ఉండే సమస్యలను దృష్టిలో ఉంచుకుని కరెంట్ లేని చోట సోలార్ పంపుసెట్లను ఏర్పాటు చేస్తూ గిరిజనులకు ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. ఈ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నిరుపేదలకు పంచడానికి ప్రభుత్వం వద్ద భూములు లేవని అన్నారు. అయితే చదువు లేని కారణంగా చాలా మంది పేదరికంలో మగ్గుతున్నారని... అందుకే నిరుపేదలు చదువుకోవడానికి కావలసిన అన్ని వసతులు, సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. నిర్దిష్టమైన ప్రణాళికలతో కష్టపడి చదువుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇటీవల మీడియా చిట్‌చాట్‌లో "నేనే రాజు, నేనే మంత్రి" అని చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి వివరణ ఇచ్చారు. "నేనే రాజు, నేనే మంత్రి అంటే... నేనే ముఖ్యమంత్రిని, నేను మున్సిపల్ మంత్రిని అని ఉద్దేశం" అని పేర్కొన్నారు.



## నేడు చైర్మన్లు, మేయర్ల ఎన్నిక

మొదటి పేజీ తరువాయి

ఉండనుండటంతో.. వారిని ఎలా ఎన్నుకోవాలన్న దానిపై సుదీర్ఘంగా చర్చిస్తున్నారు. ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికలు జరగ్గా.. 13న ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ ఫలితాల్లో 85 మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మరో 10 స్థానాలను కూడా చేజిక్కించుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం.. ఒక్కో మున్సిపాలిటీ, కార్పొరేషన్లో వార్డు సభ్యులతో పాటు మీటింగ్ కు వచ్చే ఎక్స్ అఫీషియో సభ్యుల ఓట్లు కలిపి 50 శాతానికి పైగా ఓట్లు వచ్చిన అభ్యర్థిని మేయర్, డిప్యూటీ మేయర్, చైర్ పర్సన్, డిప్యూటీ చైర్ పర్సన్ గా ఎన్నుకుంటారు.

## కౌన్సిలర్ల ఇళ్లకు పోలీసులా?

మొదటి పేజీ తరువాయి

ప్రలోభ పెట్టడం, ఇళ్లకు పోలీసులను పంపడం, గూండాలను ఉపయోగించడం వంటి చర్యలకు దిగుతోందని ఆయన విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్ల ఎన్నిక జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మండిపడ్డారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే సీపీఐకి మద్దతిస్తున్నట్లు కేటీఆర్ స్పష్టం చేశారు. సింగరేణి సంస్థను దోచుకోవడంలో కాంగ్రెస్, బీజేపీ రెండూ భాగస్వాములేనని, సంస్థకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సీపీఐకి అనుబంధంగా ఉన్న ఏఐటీయూసీ కూడా కాంగ్రెస్‌తో పొత్తును ఎలా అంగీకరించిందో అర్థం కావడం లేదని, దీని వెనుక ఎలాంటి ఒత్తిళ్లు ఉన్నాయో తెలియదన్నారు. ఎవరు కలిసినా, కలవకపోయినా సింగరేణి కార్మికుల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని ఆయన తేల్చిచెప్పారు. గతంలో తమ ప్రభుత్వం గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి, వేలాది మంది గిరిజన యువతకు రాజకీయ అవకాశాలు కల్పించిందని కేటీఆర్ గుర్తుచేశారు. సుమారు 4.5 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చి గిరిజనుల భూ హక్కులను కాపాడామని తెలిపారు.



# వెగటు రాజకీయాలతోనే బీఆర్ఎస్ ఓటమి

## కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): వెగటు రాజకీయాలు చేస్తేనే బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారం కోల్పోయిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం జాగృతి భవన్‌లో సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించారు. భోగ్ బండార్ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. తాము ఒక్క మున్సిపాలిటీ గెలిస్తే కాంగ్రెస్ ఆ సీటును లాక్కున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో అడిగేవాళ్లు, ప్రతిపక్షం ఉండొద్దా..? అని ప్రశ్నించారు. ఇట్ల ప్రతిపక్షాలు ఉండకుండా చేసే బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందన్నారు. ఏ పార్టీలో గెలిచినా బీఆర్ఎస్‌లోకి చేర్చుకొని వెగటు పుట్టేలా చేశారని పేర్కొన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ కూడా అలాగే చేస్తున్నదని.. ప్రతిపక్షాలను, అడిగే వారిని ఉండనివ్వాలని అన్నారు. కాంగ్రెస్‌కు సైతం కచ్చితంగా ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సేవాలాల్ ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాదని.. సంఘ సంస్కర్త కూడా అని తెలిపారు. బంజారాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ మోసం చేసిందని.. బంజారాలకు, ఆదివాసీలకు ఈ సీఎం లొల్లి పెట్టిస్తున్నారని ఆరోపించారు. జీవో 33 ప్రకారం బంజారాలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సేవాలాల్ సందేశం ప్రకారం జాగృతి ముందుకు వెళుతుందని స్పష్టం చేశారు. గోర్ భోళి భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. పేదరికాన్ని నిర్మూలించాలంటే ప్రత్యేక కార్యాచరణతో ప్రత్యేక ఫండ్ కేటాయించాలన్నారు. బంజారాలు మంచి పొజిషనల్‌లో ఉండాలని.. రాజకీయాల్లో వారి రిప్రజెంటేషన్ ఉండాలని సూచించారు. యువ మిత్రులు తండాల్లో వెలుగులు నింపేలా నాయకత్వం చేపట్టాలని, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వారు పోటీ చేయాలని పిలుపునిచ్చారు. లీడర్ షిప్ కావాలనుకునే యువత గ్రామాల్లో ఉండాలని అన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా చేసుకున్నప్పటికీ సరైన వసతులు లేవని.. ఈ పరిస్థితి మారాలంటే సీఎం ప్రతీ తండాకు రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తండాల్లో రేషన్ షాప్‌లు, గ్రామపంచాయతీ, అంగన్ వాడీలు కట్టాలన్నారు. నల్గొండ, నిజామాబాద్, ఖమ్మం, మహబూబాబాద్‌లో ఐటీడీఏలు పెట్టాలన్నారు.

# మేం బీఆర్ఎస్‌లోనే ఉన్నాం

## కామారెడ్డి కౌన్సిలర్ల స్పష్టీకరణ

కామారెడ్డి, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): కామారెడ్డి మున్సిపల్ ఎన్నికలలో గెలిచిన నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు తాము ఏ పార్టీలో చేరలేదని, బీఆర్ఎస్‌లోనే ఉన్నామని, కొత మంది సోషల్ మీడియాలో తాము కాంగ్రెస్‌లో చేరినట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని, ఆ ప్రచారాలను నమ్మొద్దని ప్రకటించారు. ఈ మేరకు ఆ నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు (18 వ వార్డు కౌన్సిలర్ హఫీజ్ బేగ్, 45వ వార్డ్ కౌన్సిలర్ పిట్ల వేణుగోపాల్, 46వ వార్డ్ కౌన్సిలర్ గరిగంటి లక్ష్మీనారాయణ, 47వ వార్డ్ కౌన్సిలర్ గరిగంటి స్వప్న) కాంగ్రెస్ లో చేరుతున్నట్టు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాన్ని బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఖండించారు. ఈ సందర్భంగా ఆదివారం వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము కాంగ్రెస్ పార్టీలో చేరలేమని బీఆర్ఎస్ పార్టీతోనే ఉన్నామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. తాము ఏ ప్రలోభాలకు లొంగలేదని, తమ అధిష్టానం మేరకే నడుచుకుంటామని ప్రకటించారు. కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సారథ్యంలోని బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దిన్, పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌దే నిజామాబాద్ మేయర్ పీఠం

## ఎంఐఎంకు డిప్యూటీ మేయర్ పదవి

### ఎంఐఎంతో హస్తానికి కుదిరిన పొత్తు

నిజామాబాద్, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): నిజామాబాద్ మేయర్ పీఠంపై చిక్కుముడి వీడింది. కాంగ్రెస్‌కు మేయర్ పదవి, ఎంఐఎంకు డిప్యూటీ మేయర్ పదవి షేర్ చేసుకునేలా అంగీకారం కుదిరింది. ఈ మేరకు కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల మధ్య ఈ మేరకు అంగీకారం కుదిరినట్లు సమాచారం. నగరపాలక సంస్థకు మట్నుత్తం 60 డివిజన్లు ఉండగా బీజేపీ 28 స్థానాలతో అతిపెద్ద పార్టీగా నిలిచింది. కాంగ్రెస్‌కు 17, ఎంఐఎంకు 14, బీఆర్ఎస్‌కు ఒక స్థానం లభించింది. దీంతో కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు పొత్తు పెట్టుకున్నాయి. అయితే ఏ పార్టీకి కూడా మ్యాజిక్ ఫిగర్ సీట్లు రాకపోవడంతో నిజామాబాద్‌లో హంగ్ ఏర్పడింది. దీంతో ఇందూరులో రాజకీయంగా ఆసక్తికర వాతావరణం నెలకొంది. బీజేపీ అత్యధిక సీట్లు గెలిచినప్పటికీ మేయర్ అయ్యే ఛాన్స్ లేకపోవడంతో కాంగ్రెస్ పావులు కదిపింది. అయితే కాంగ్రెస్ మేయర్ అభ్యర్థిగా ఉన్న కాటిపల్లి శమంత 19వ డివిజన్ నుంచి పోటీ చేసి ఓడిపోవడంతో కాంగ్రెస్ పార్టీకిలోనే మరికొందరు మేయర్ స్థానానికి పోటీపడుతున్నారు. 21వ డివిజన్ నుంచి గెలిచిన పంచరెడ్డి లలిత, 49వ డివిజన్ నుంచి గెలిచిన కూరగాయల ఉమారాణి, 41వ డివిజన్ నుంచి గెలిచిన బొంబోతుల పుజిత, 12వ డివిజన్ నుంచి గెలిచిన దూమాల అరుంధతి, అలాగే 9వ డివిజన్ నుంచి గెలిచిన కేతావత్ సురేఖలు మేయర్ రేసులో ఉన్నారు. మొత్తం ఐదుగురు మహిళలు పోటీలో ఉండగా నలుగురు బీసీలు, ఒకరు ఎస్టీ ఉన్నాట్లు తెలుస్తోంది. అయితే గతంలో కూడా ఇక్కడ హంగ్ వచ్చింది. ఈ కార్పొరేషన్‌లో బీజేపీ ఎంపీ ధర్మపురి అరివంద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, కాంగ్రెస్‌కు చెందిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ ఎక్స్ అఫీషియో ఓట్లు నమోదు చేసుకున్నా రు. దీంతో బీజేపీకి మూడు, కాంగ్రెస్‌కు రెండు ఓట్లు పెరిగినట్లైంది. బీఆర్ఎస్ అభ్యరిథ ని మినహాయించినప్పటికీ కాంగ్రెస్-ఎంఐఎం కూటమికి 33 ఓట్లు అవుతాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ మేయర్ పీఠం చేజిక్కించుకుంది.



# 18 నుంచి యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 2026 వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 18 నుంచి 28 వరకు వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో భవానీశంకర్ తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 18న స్వస్తీవాచనం, అంకురార్పణ, విశ్వక్సేరాధన, రక్షాబంధనంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 24న ఎదుర్కోళ్లు, 25న స్వామివారి తిరుకల్యాణోత్సవం, 26న దివ్య విమాన రథోత్సవం, 27న మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, 28న శతఘటాభిషేకంతో ఉత్సవాలకు పరిసమాప్తి పలుకుతామని పేర్కొన్నారు. ఆరు రోజులపాటు అలంకార సేవలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించినట్టు అన్నారు. ఈ ఉత్సవాల్లో 100 మంది పారాయణీకులు, రుత్వికులు, ఆచార్యులు, పండితులు పాల్గొననున్నట్టు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణమంతా విద్యుద్దీపకాంతులతో మిరిమిట్లు గొలిపే అలంకరించనున్నట్టు తెలిపారు. బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 18 నుంచి 28వరకు నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, మొక్కు సేవలను రద్దు చేస్తున్నట్టు ఈవో ప్రకటించారు.

# 17న ఘనంగా కేసీఆర్ బర్త్‌డే వేడుకలు

## మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను ఈ నెల 17న (మంగళవారం) రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను గుర్తు చేసుకున్నారు. 'నీళ్లు లేని గోస, కరెంట్ లేని కష్టాలను తీర్చిన ఏకైక నాయకుడు కేసీఆర్. ఒక ఆడబిడ్డ పెళ్లికి కల్యాణ లక్ష్మి ద్వారా లక్ష రూపాయలు ఇచ్చి మేనమామలా ఆదుకున్నారు. గర్భిణీలకు కేసీఆర్ కిట్, రైతులకు రైతు బంధు, వృద్ధులకు ఆసరా పెన్షన్లు (రూ.200 నుంచి రూ.2016 పెంపు) అందించి ప్రజల గుండెల్లో నిలిచిపోయారు' అని తలసాని కొనియాడారు. విద్యార్థుల కోసం గురుకులాలు, విదేశీ విద్య కోసం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు, సాగునీటి కోసం కాళేశ్వరం ప్రాజెక్టును తెచ్చిన దార్శనికుడు కేసీఆర్ అని అన్నారు.




కేసీఆర్ పుట్టినరోజున రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలు, మసీదులు, చర్చీలల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాలని కోరారు. ఇక రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు,



ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొంటారని చెప్పారు. అనంతరం అందరికీ భోజన ఏర్పాట్లు ఉంటాయని వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపైనా తలసాని స్పందించారు. "అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి 15 లక్షల ఓట్లు వస్తే.. ప్రతిపక్షంలో ఉన్న మాకు 10.80 లక్షల ఓట్లు వచ్చాయి. ఇది సామాన్య విషయం కాదు. మా హయాంలో లోకల్ బాడీ ఎన్నికలు జరిగితే వన్ సైడ్ ఉండేవి. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు చూపిన పోరాట పటిమ అద్భుతం," అని తలసాని ప్రశంసించారు. ఈ సమావేశంలో పల్లె రవికుమార్, కిషోర్ గౌడ్, ముఠా జయసింహ తదితరులు పాల్గొన్నారు.



# 42% తోనే పరిషత్తు ఎన్నికలు

## లేకపోతే రాష్ట్రం అగ్నిగుండమే

### సర్కారుకు ఆర్ కృష్ణయ్య హెచ్చరిక

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): మున్సిపల్ చైర్మన్ , మేయర్ పదవులలో బీసీలకు 50 శాతం కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు , బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం చేశారని... కానీ జనరల్ స్థానాలలో బీసీలు నిలబడి గెలుపొందరన్నారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్, బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య ల అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆర్ కృష్ణయ్య పాల్గొని ప్రసంగించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. కోర్టులో కేసు ఉందని గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేశారని... ఇప్పుడు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను కూడా అదే తరహాలో నిర్వహించాలని చూస్తున్నారన్నారు. హై కోర్ట్ లో కేసు గెలుపొందడానికి ప్రభుత్వ తరుపున వాదించడానికి ఢిల్లీ నుండి సీనియర్ న్యాయవాదులు పెట్టి వాదించాలన్నారు. సీఎం ఢిల్లీ కి 64 సార్లు వెళ్లినా.. బీసీల డిమాండ్లపై ప్రధాని వద్ద చర్చించలేదని మండిపడ్డారు. 42 శాతం రిజర్వేషన్ల కేసు గెలిచిన తరువాతే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ నేతలు జిల్లపల్లి అంజి, సతీష్, రాజేందర్, శివకుమార్ యాదవ్, మోదీ రాందేవ్, భీంరాజ్ , భాస్కర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్‌వి నెగటివ్ రాజకీయాలు

## దేశ పురోగతిని వెనక్కి లాగే చర్యలు.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై విపక్షనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు, ఎగుమతిదారుల్లో అనవసర భయాందోళనలు కలిగించేందుకు రాహుల్ కుటిల ప్రయత్నం చేస్తున్నారని ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు. నెగటివ్ రాజకీయాల ద్వారా.. దేశ పురోగతిని వెనక్కు లాగేందుకు రాహుల్ కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. రాహుల్ వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని, అందుకే అన్నదాతలు, ఎగుమతిదారులను తప్పుదోవ పట్టించేందుకు రాహుల్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రస్తుతం భారత్ రూ.4 లక్షల కోట్ల విలువైన వస్త్రాలను ఎగుమతి చేస్తోందని, 38 అభివృద్ధి చెందిన దేశాల పరిధిలోని 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా రూ.45 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ మార్కెట్‌కు అవకాశాలు ఏర్పడ్డాయని ఆయన వివరించారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 7 మెగా టెక్స్ టైల్ పార్కులను అభివృద్ధి చేస్తోందని, ఇందులో ఒకటి తెలంగాణలోని వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పేరుతో డెవలప్ అవుతోందని కేంద్ర మంత్రి వివరించారు. అమెరికా, ఇతర దేశాలతో కుదురుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కారణంగా ఎగుమతులు గణనీయంగా పెరిగి, వేల సంఖ్యలో ఉద్యోగాల కల్పన జరుగుతుందని




కిషన్ రెడ్డి తెలిపారు. దీని వల్ల తెలంగాణకు కూడా పెద్దమొత్తంలో లబ్ధిచేకూరనుందన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందడం, ఇక్కడి యువతకు ఉద్యోగాలు రావడం రాహుల్ గాంధీకి ఇష్టంలేదా? అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఒకవైపు వస్త్ర పరిశ్రమ ఎగుమతిదారులను, మరోవైపు పత్తి డిమాండ్ తగ్గుతుందని రైతులను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని కేంద్ర మంత్రి ఫైరయ్యారు. వాస్తవమేంటంటే.. భారత వస్త్ర పరిశ్రమ రంగంలో విస్తారమైన వృద్ధి అవకాశాలు ఉన్నందున భారత పత్తికి డిమాండ్ నిరంతరం పెరుగుతుందని, దీని ద్వారా రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని, కాబట్టి భారతీయ పత్తి రైతులు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కిషన్ రెడ్డి స్పష్టంచేశారు. దేశ అన్నదాతల విషయంలో అన్యాయంగా వ్యవహరించినందుకు కాంగ్రెస్ సిగ్గుపడాలని విమర్శించారు. ఇప్పటివరకు వరుసగా 100 ఎన్నికల్లో వరుస పరాజయాల తర్వాత రాహుల్ గాంధీ నిరాశ, నిస్పృహలతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని కిషన్ రెడ్డి ఎద్దేవాచేశారు. ప్రధాని మోదీపై ఉన్న వ్యతిరేకతను దేశంపై వ్యతిరేకతగా రాహుల్ మలుచుకున్నారని ఫైరయ్యారు. అందుకే.. 11 ఏళ్లుగా దేశం సాధిస్తున్న ప్రగతిని చూసి జీర్ణించుకోలేక, అధికారం దక్కదన్న అసహనంతో.. దేశంలో అన్నదాతలను, ఎగుమతిదారులను రెచ్చగొట్టేందుకు విఫలయత్నం చేస్తున్నారని, వీటిని కూడా ప్రజలు తిప్పికొడతారని కిషన్ రెడ్డి తెలిపారు.

# కౌన్సిలర్ల క్యాంపులోకి పోలీసులెలా?


## వాళ్లేమైనా దొంగతనం చేశారా?

### ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సీరియస్

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ దౌర్జన్యాలకు పాల్పడిందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. బీఆర్ఎస్ పక్షాన నిలబడిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 30 శాతం ఓటు షేర్ నమోదు చేసుకుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందనడానికి ఇదే ఉదాహరణ అని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి కీలక శాఖలను తన దగ్గరే పెట్టుకున్నారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని రేవంత్ రెడ్డి అపహస్యం చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి పాలనలో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని అన్నారు. రాష్ట్రానికి రెవెన్యూ రాబడి పూర్తిగా పడిపోయిందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా మూడు రోజుల ముందే మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. కనీసం 15 రోజుల టైమ్ ముందే షెడ్యూల్ ఇవ్వాలి.. కానీ వారం రోజుల్లోనే అన్నీ పూర్తి చేసి రాష్ట్ర ఎన్నికల కమిషన్ మమ అనిపించిందని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నేతలు కోడ్ ఉల్లంఘించినా ఎన్నికల కమిషన్ నోటీసులు ఇవ్వలేదని ఆర్ఎస్



ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గెలుపు కోసం కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడుతుందని మండిపడ్డారు. వారికి ఎన్నికల అధికారులు అండగా నిలిచారని అన్నారు. కోడ్ ఉల్లంఘించినా నోటీసులు ఎక్కడ కూడా ఇచ్చిన దాఖలాలు కనిపించడం లేదని తెలిపారు. వీడియో, ఆధారాలతో సహా చూపించినా సీఎం రేవంత్ రెడ్డికి నోటీసులు ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధ సంస్థలు నీరుగారినట్టేనా అని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి కేవలం 15 శాతం ఓట్లే వచ్చాయని ఆంధ్రజ్యోతి అబద్దాలు రాసిందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. అబద్ధాన్ని పదే పదే చెబితే నిజం అవుతుందని రాధాకృష్ణ కుట్రలు పన్నారని విమర్శించారు. దీనికి రాధాకృష్ణ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లెక్కలు కూడా రానివారిని ఎడిటోరియల్‌లో ఎలా పెట్టుకున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు 29 శాతం ఓట్లు వచ్చాయని ఈసీ ప్రకటించిందని తెలిపారు. చరిత్రలో ఏ ప్రతిపక్ష పార్టీకి స్థానిక సంస్థల్లో ఇంత శాతం ఓటింగ్ రాలేదని పేర్కొన్నారు. ఈ నిజాన్ని ఆంధ్రజ్యోతి తొక్కిపెట్టిందని మండిపడ్డారు. ఈసీ ప్రకటన తర్వాత ఆంధ్రజ్యోతి సవరణలు చేసిందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి కోరిక మేరకు కొన్ని పత్రికలు తప్పుదారి పట్టిస్తున్నాయని అన్నారు. ఫార్ములా ఈ కార్ రేస్ కేసు గురించి మళ్లీ లీకులు ఇస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అదొక లొట్టపీసు కేసు అని ఇప్పటికే చెప్పామని అన్నారు. కాంగ్రెస్ ఎన్ని డైవర్షన్ రాజకీయాలు చేసినా ప్రజాపక్షం బీఆర్ఎస్ వైపే ఉందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెసోళ్లు ఇతర పార్టీల కౌన్సిలర్లను కిడ్నాప్‌లు చేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్‌కు మెజారిటీ వచ్చిందని తెలిపారు. అక్కడ ఒక ఇండిపెండెంట్ బీఆర్ఎస్‌కు మద్దతిచ్చాడని తెలిపారు. అయితే వారు ఎక్కడ ఉన్నారో ట్యాపింగ్ ద్వారా గుర్తించి, అక్కడికి పోలీసులను పంపించారని పేర్కొన్నారు. వాళ్లేమైనా దొంగతనం చేసి క్యాంపులో కూర్చున్నారా అని ప్రశ్నించారు. అక్కడికి పోలీసులను పంపించాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. రేవంత్ రెడ్డికి ఇంత కసి, దుర్మార్గం ఎందుకు అని ప్రశ్నించారు. ఎక్స్‌అఫీషియో ఓటుకోసం కాగజ్‌నగర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ దండే విఠల్‌కు ఓటు హక్కు కల్పించడంపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. దండే విఠల్ ఓటు సనత్‌నగర్‌లో ఎప్పుడు డిలీట్ అయ్యిందని ఆయన ప్రశ్నించారు. హఠాత్తుగా ఆయనకు కాగజ్‌నగర్‌లో ఓటు ఎలా వచ్చిందని నిలదీశారు. కాంగ్రెస్ -- బీజేపీలది అపవిత్ర కూటమి అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. తెలంగాణ సంపదను దోచుకునే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. దోపిడీని అడ్డుకోవడానికి బీఆర్ఎస్ వీరోచిత పోరాటం చేస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ వెంట ప్రజలంతా నడుస్తున్నారని పేర్కొన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. ధర్మపురి అర్వింద్‌ది నోరా? మోరీనా అని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. పోలీసులను తన్నుకుంటూ పోవాలని అర్వింద్ రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. జగ్గారెడ్డి, ధర్మపురి అర్వింద్‌ను ఎందుకు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచలేదని ప్రశ్నించారు. ఎన్టీవీ జర్నలిస్టులను ఆగమేఘాల మీద అరెస్టులు చేశారని గుర్తుచేశారు. జర్నలిస్టులకు ఒక న్యాయం? కాంగ్రెస్, బీజేపీలకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు.



# సూది మొనపై శివలింగం



జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లాకు చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారుడు, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ గ్రహీత డాక్టర్ గుర్రం దయాకర్ మరో అద్భుతాన్ని ఆవిష్కరించారు. భక్తులంతా 'హర హర మహాదేవ' అంటూ శివనామస్మరణలో మునిగిపోయిన వేళ, ఆయన తనదైన శైలిలో సూక్ష్మ కళాఖండాన్ని రూపొందించి మహేశ్వరుడిపై ఉన్న భక్తిని చాటుకున్నారు. 10 గంటల పాటు శ్రమించి పంపకాల సూది మొనపై శివయ్య విగ్రహాన్ని అత్యద్భుతంగా రూపొందించారు. శివరాత్రి వేళ దయాకర్ సూదిమొనపై రూపమిచ్చిన శివయ్య విగ్రహం అమితంగా ఆకట్టుకుంటోంది. నాగుపాము పడగ నీడలో శివయ్య కూర్చుని భక్తులను ఆశీర్వదిస్తున్నట్లుగా ఉన్న ఈ విగ్రహం చూసేవారిని అబ్బురపరుస్తోంది. పంపకాల సూది మొనపై అత్యంత సూక్ష్మంగా ఈ విగ్రహాన్ని తీర్చిదిద్దారు దయాకర్. ఈ విగ్రహం తయారీకి నైలాన్, పెన్సిల్ రంగులను ఉపయోగించానని, ఈ అద్భుత విగ్రహం పూర్తి చేయడానికి సుమారు 10 గంటల సమయం పట్టిందని ఆయన తెలిపారు. ప్రతి పండుగకు ఇలాంటి వైవిధ్యమైన కళాఖండాలను సృష్టిస్తుంటారాయన.

# ఉచితంగా హనుమాన్ చాలీసా బుక్స్ పంపిణీ

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): మహాశివరాత్రి సందర్భంగా జగిత్యాలలోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయ నిర్వాహకులు గొప్ప కార్యానికి శ్రీకారం చుట్టారు. స్థానికంగా ఉన్న సహస్ర లింగాల దేవాలయంలో దర్శనానికి వచ్చిన భక్తులకు హనుమాన్ చాలీసా పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధన్వంతరి ఆలయ వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. విజయవాడకు చెందిన శ్రీ సాయి జ్ఞాన యజ్ఞం ట్రస్ట్, తిరు సాయి ఆధ్వర్యంలో ఈ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వొడ్నాల లత, సహాయ కార్యదర్శి భారతల రాజసాగర్, గీత, సహాన, సంధ్య, వేణుగోపాల్ పాల్గొన్నారు.



# శివాలయాలకు పోటెత్తిన భక్తులు



మల్యాల, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): మహాశివరాత్రిని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా భక్తులు శివాలయాలకు పోటెత్తారు. జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని పురాతన శివాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. షట్తారక సహిత మహాశివుడిగా దర్శనమిచ్చిన శివయ్య కోసం ఆలయ పరిసరాల్లో భారీగా బారులు తీరారు. అభిషేకాలు, అర్చనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

# నేతన్నలకు ఏప్రిల్ 1 నుంచి ఉచిత విద్యుత్

**ఏపీ సర్కార్ గుడ్ న్యూస్**

అమరావతి, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): ఏపీలోని చేనేత, మరమగ్గాల కార్మికులకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. మరో హామీ అమలుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఎన్నికల సమయంలో చేనేత కార్మికులకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యజమానులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ హామీకి అనుగుణంగా అర్హులైన నేత కుటుంబాల గుర్తింపు ప్రక్రియ పూర్తయింది. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో 'నేతన్నల ఉచిత విద్యుత్' పథకానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో ఈ పథకం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. దీంతో వేలాది చేనేత, మరమగ్గాల కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గనుంది. ఈ నిర్ణయంపై చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ముఖ్యమంత్రి చంద్రబాబుకు నేతన్నల కుటుంబాల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# భారత విద్యార్థి సాకేత్ మృతి


**ధ్రువీకరించిన యూఎస్ కాన్సులేట్**

న్యూయార్క్: అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లిన మరో భారత విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. కాలిఫోర్నియాలోని బర్కిలీలో కొద్దిరోజుల క్రితం అదృశ్యమైన సాకేత్ శ్రీనివాసయ్య (22) మరణించినట్లు శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ కార్యాలయం ఆదివారం ధ్రువీకరించింది. ఫిబ్రవరి 12వ తేదీ ఉదయం నుంచి సాకేత్ కనిపించడం లేదంటూ ఫిర్యాదులు అందాయి. దీంతో స్థానిక పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే సాకేత్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కాన్సులేట్ తన ప్రకటనలో తెలిపింది. సాకేత్ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా (యూసీ), బర్కిలీలో కెమికల్ అండ్ బయోమాలిక్యులర్ ఇంజనీరింగ్ విభాగంలో మాస్టర్స్ డిగ్రీ చదువుతున్నాడు. గతంలో ఐఐటీ మద్రాస్‌లో బీటెక్ పూర్తి చేశాడు. "స్థానిక పోలీసులు భారత విద్యార్థి సాకేత్ శ్రీనివాసయ్య మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ధ్రువీకరించారని తెలియజేయడానికి చింతిస్తున్నాము. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, ప్రియమైన వారికి మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము" అని కాన్సులేట్ కార్యాలయం 'ఎక్స్' వేదికగా పేర్కొంది. మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని, కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని స్పష్టం చేసింది. పోలీసుల నివేదికల ప్రకారం సాకేత్‌ను చివరిసారిగా లేక్ అంజా సమీపంలో చూశారు. గాలింపు చర్యల అనంతరం అక్కడే అతడి మృతదేహం లభించినట్లు తెలిసింది. అతడి అదృశ్యం వెనుక గల కారణాలపై పోలీసులు స్పష్టత ఇవ్వనప్పటికీ, అతడు 'రిస్క్'లో ఉన్నట్లుగా భావించి గాలింపు చేపట్టారు. మరణానికి గల కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.

# ప్రపంచంలోనే తొలి ఏఐ మహాశివరాత్రి - డిజిటల్ నాద యజ్ఞం

**50 నిమిషాల్లో 5,700కు పైగా తెలుగు శివ భక్తి గీతాల సృష్టి**

**సాంకేతికత - సమూహ ఆధ్యాత్మికతల కలయికలో కొత్త మైలురాయి**



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): ఆధ్యాత్మికతకు సాంకేతికతను జోడిస్తూ ప్రపంచంలోనే తొలి 'ఏఐ మహాశివరాత్రి – డిజిటల్ నాద యజ్ఞం' కార్యక్రమం ఘనవిజయాన్ని సాధించింది. సూపర్ ఏఐ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహత్తర డిజిటల్ భక్తి యజ్ఞంలో ప్రపంచవ్యాప్తంగా 500కు పైగా మంది ఒకే వేదికపై చేరి కేవలం 50 నిమిషాల్లో 5,700కు పైగా తెలుగు శివ భక్తి గీతాలను సృష్టించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమం ఆన్‌లైన్ వేదికైన జూమ్ ద్వారా నిర్వహించబడింది. గీతాల సాహిత్య రూపకల్పన కోసం చాట్ జీపీటీ, చాట్ జీపీటీ కాస్టమ్ జీపీటీ వినియోగించగా, సంగీత నిర్మాణానికి ఏఐ ఆధారిత సంగీత సాధనాలు ఉపయోగించారు. మహాశివరాత్రి పర్వదినాన పరమశివునికి సమూహ నాదార్పణగా ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు అంకితం చేశారు. "డిజిటల్– నాద యజ్ఞం"లో పాల్గొనేవారు శివుని విభిన్న రూపాలైన శివ, రుద్ర, నటరాజ, అర్ధనారీశ్వర, లింగ రూపాలు, శివ తాండవం వంటి భావాలతో గీతాలను సృష్టించారు. అన్ని గీతాలు తెలుగులోనే రూపొందడం ప్రత్యేకతగా నిలిచింది.

**108 గీతాల ప్రత్యేక ప్రసారం**

సృష్టించిన 5,700కు పైగా గీతాల నుంచి ఎంపిక చేసిన 108 భక్తి గీతాలను రాత్రి 10 గంటల నుంచి ఉదయం 1 గంటల వరకు మూడు గంటల ప్రత్యేక జూమ్ ప్రసారంలో వినిపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రసారం పవిత్ర నాదార్పణగా, సమూహ భక్తి అనుభూతిగా రూపుదిద్దుకుంది. ఈ కార్యక్రమానికి ఇంపాక్ట్ సహకారం అందించింగా డిస్ట్రిక్ట్ గంపా నాగేశ్వర్ రావు నాయకత్వం వహించగా, ట్రెజరర్ గంపా ఆదిత్య భారత్ మద్దతు తెలిపారు. సూపర్ ఎఐ అకాడమీ కోర్ టీమ్ సభ్యులు దాసా అఖిల్, అక్షయ్ కుమార్, సుమంత్, శ్రీధర్ స్వామి, జయ శ్రీ తదితరులు సాంకేతిక నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. సూపర్ ఏఐ అకాడమీ వ్యవస్థాపకులు నిఖీలు మాట్లాడుతూ.. సంప్రదాయాన్ని భర్తీ చేయడం కాకుండా మానవ సంకల్పాన్ని విస్తరించడమే ఏఐ లక్ష్యమని తెలిపారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక సందర్భాల్లో కృత్రిమ మేధస్సు వినియోగం ద్వారా కొత్త అవకాశాలు సృష్టించవచ్చని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పాల్గొనేవారికి నమోదు మరియు వివరాల కోసం ~ా×మీఖ్త్రుంప్త్రఅఝుతీఖ్తీఱ.ఎశీఏ అనే ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేశారు.

# చైర్మన్ పదవి మాదిగలకే ఇవ్వాలి

**ఖమ్మం ఎమ్మార్పీఎస్ నేత కందుల బాబు**



ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): ఖమ్మం రూరల్ ఏదులాపురం మున్సిపాలిటీ చైర్మన్ పదవి మాదిగలకే ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా బాధ్యుడు కందుల బాబు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీని మొదటి నుంచి మాదిగలు నమ్ముకుంటూ వస్తున్నారని, అలాంటి వారికి గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఈ జిల్లాలో రెండు అసెంబ్లీ సీట్లు ఒకే వర్గానికి ఇచ్చారని గుర్తుచేశారు. జిల్లా పరిషత్తు సహా పలు నామినేటెడ్ పదవుల్లో కూడా మాదిగలకు మొండిచేయి చూపారని, ఈసారి ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వు అయినందున ఎస్సీలోని మాదిగ వర్గానికే ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఖమ్మం జిల్లాలో తగిన ప్రాతినిధ్యం లేనందున ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ నుంచి ఎస్సీ మహిళలు నలుగురు గెలిస్తే ముగ్గురు మాదిగ కులానికి చెందినవారు ఉన్నారని వివరించారు. మంత్రి పొంగులేటి ఈ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జాంబవ గ్రూప్ సభ్యులు పేరెల్లి శ్రీనివాస్, మరికంటి కన్నారావు, కొల్లి విద్యాసాగర్, నెమలి కిశోర్, మాతంగి అనిల్ కుమార్, బొబ్బిళ్ళ నాగరాజు, వెలుతురు శ్రీనివాస్, మునగాల లాల్ బాబు, బోయిన కృష్ణ, గుగ్గిళ్ళ ప్రభాకర్, ఉపేందర్, శ్రీనివాసులు పాల్గొన్నారు




# మేఘా సంస్థలో జేడీ లక్ష్మీనారాయణకు కీలక పదవి

**ఈవీ ట్రాన్స్ వైస్ ప్రెసిడెంట్ - ఆపరేషన్స్‌గా బాధ్యతలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): సీబీఐ మాజీ జేడీ, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. ఆయన ప్రముఖ మౌలిక సదుపాయాల సంస్థ మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్‌కు చెందిన అనుబంధ సంస్థ ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వైస్ ప్రెసిడెంట్ – ఆపరేషన్స్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ నియామకాన్ని సంస్థ లింక్డ్‌ఇన్ ద్వారా అధికారికంగా ప్రకటించింది. 1990 మహారాష్ట్ర క్యాడర్ ఐపీఎస్ అధికారి అయిన లక్ష్మీనారాయణ, సీబీఐ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసిన సమయంలో జగన్ అక్రమాస్తుల కేసుతో పాటు పలు కీలక కేసుల దర్యాప్తులో కీలకంగా వ్యవహరించి తెలుగు రాష్ట్రాల్లో సుపరిచితులయ్యారు. ముంబైలో అడిషనల్ డీజీగా పదవీ విరమణ చేసిన అనంతరం ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున విశాఖపట్నం ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తర్వాత 'జై భారత్ నేషనల్ పార్టీ' పేరుతో సొంత పార్టీని కూడా స్థాపించారు. కొంతకాలం పాటు వ్యవసాయం కూడా చేశారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఈవీ ట్రాన్స్, దేశంలోని ప్రముఖ ఎలక్ట్రిక్ బస్ ఆపరేటర్లలో ఒకటి. తెలంగాణ ఆర్టీసీతో పాటు ముంబై, పుణే వంటి నగరాల్లో దాదాపు 900కు పైగా ఎలక్ట్రిక్ బస్సులను ఈ సంస్థ నడుపుతోంది. లక్ష్మీనారాయణకు ఐపీఎస్‌కు ముందే ఇంజినీరింగ్ నేపథ్యం ఉంది. ఎన్ఐటీ వరంగల్, ఐఐటీ మద్రాస్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. ఆయనకున్న ఇంజినీరింగ్ పరిజ్ఞానం, పరిపాలన అనుభవం తమ సంస్థ అభివృద్ధికి దోహదపడతాయని ఈవీ ట్రాన్స్ యాజమాన్యం విశ్వాసం వ్యక్తం చేసింది. సుదీర్ఘ ప్రభుత్వ సేవ, రాజకీయ ప్రయోగాల తర్వాత ఆయన కార్పొరేట్ రంగంలోకి అడుగుపెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# నేడు ఏపీలో బిల్ గేట్స్ పర్యటన



విజయవాడ, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపక అధినేత బిల్ గేట్స్ సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కీలక రంగాల్లో భాగస్వామ్యంపై చర్చించేందుకు ఆయన తన బృందంతో కలిసి ఏపీకి వస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లతో సమావేశమవుతారు. ఆదివారం అందిన సమాచారం ప్రకారం, సోమవారం ఉదయం 10 గంటలకు బిల్ గేట్స్ సచివాలయానికి చేరుకుంటారు. ముందుగా రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) కేంద్రాన్ని సందర్శించి, పాలనలో సాంకేతికత వినియోగాన్ని పరిశీలిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర మంత్రులు, అధికారులతో బిల్ గేట్స్ బృందం సమావేశమవుతుంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఇప్పటికే అమలవుతున్న ప్రాజెక్టులను మరింతగా విస్తరించడంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చిస్తారు. 'స్వర్ణాంధ్ర విజన్-2047' లక్ష్యాల సాధనకు చేపట్టిన సంస్కరణలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య, మెడ్‌టెక్, సంజీవని వంటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు బిల్ గేట్స్‌కు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ముఖ్యంగా, గేట్స్ ఫౌండేషన్ సహకారంతో నడుస్తున్న 'సంజీవని' ప్రాజెక్టు పనితీరును ప్రభుత్వం ఆయనకు ప్రత్యేకంగా వివరించనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సమావేశాల అనంతరం, బిల్ గేట్స్ బృందం అమరావతిలోని ఉండవల్లి సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తుంది. అక్కడ డ్రోన్లు, ఏఐ టెక్నాలజీ సహాయంతో చేపడుతున్న ఆధునిక వ్యవసాయ పద్ధతులను పరిశీలించనుంది.

# జనసేనకు పవన్ 2 కోట్ల విరాళం



**క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రారంభం**

**పార్టీ కోసం శ్రమించే వారే తమకు ముఖ్యమని ప్రకటన**

మంగళగిరి, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): శివరాత్రి పండుగ రోజు జనసేన పార్టీకి మరో శుభారంభం అయింది. పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్వయంగా తొలి సభ్యత్వం తీసుకుని పార్టీకి రూ.2 కోట్ల విరాళం ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకుని, సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేసే వారిని "ఉద్యమి"గా గౌరవిస్తామని తెలిపారు. పార్టీ పోరాటానికి బలం చేకూర్చి, నవతరంలో ప్రేరణ కలిగించే వారిని "సాధక్"గా, పరోక్షంగా సమయం, ఆర్థికం, సాంకేతికం, సేవా, మేధో సహకారాలు అందించే వారిని "ప్రదాత"గా ఇకపై పిలుస్తామని పవన్ కల్యాణ్ ప్రకటించారు. జనసేన పార్టీ ప్రారంభంలో 150 మందితో మొదలైందని, 2021లో మొదటి విడత సభ్యత్వంలో 90 వేలు నమోదు అయ్యాయని పవన్ తెలిపారు. గత ఎన్నికల ముందు ఆ సంఖ్య 6 లక్షలకు చేరిందని... ఎన్నికల తర్వాత 12.98 లక్షల సభ్యత్వాలు సాధించామని ఆయన గుర్తుచేశారు. చిన్న వ్యాపారులు, కూలీలు, చదువుకున్నవారు అందరూ ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యారని, పార్టీ ఆశయాలకు అనుగుణంగా నడిచేవారే ముఖ్యమని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, పార్టీ అధ్యక్షుల రాజకీయ కార్యదర్శి పిడుగు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గత సభ్యత్వ నమోదులో అత్యధిక సభ్యత్వాలు చేసినవారి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.


# చిరుకు అల్లు శిరీష్ తొలి శుభలేఖ

**త్వరలో నయనికా రెడ్డితో శిరీష్ పెళ్లి**

**చేతికి బ్యాండేజ్ తో కనిపించిన మెగాస్టార్**



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఈవార్తలు): యంగ్ హీరో అల్లు శిరీష్ పెళ్లి పనులు అధికారికంగా మొదలయ్యాయి. తన వివాహ మహోత్సవానికి సంబంధించిన తొలి శుభలేఖను ఆయన తన మామయ్య, మెగాస్టార్ చిరంజీవికి అందజేశారు. నయనికా రెడ్డితో త్వరలో ఏడడుగులు నడవనున్న శిరీష్, కుటుంబంలో పెళ్లి వేడుకలకు శ్రీకారం చుట్టారు. అల్లు శిరీష్ తన తల్లిదండ్రులైన అల్లు అరవింద్, నిర్మలతో కలిసి చిరంజీవి ఇంటికి వెళ్లారు. తన మేనత్త సురేఖ, చిరంజీవి దంపతులకు పెళ్లి పత్రికను ఇచ్చి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ ఫొటోలను శిరీష్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకున్నారు. "మా సంప్రదాయం ప్రకారం, మామయ్య చిరంజీవి గారికి, అత్త సురేఖ గారికి మొదటి పెళ్లి పత్రిక ఇచ్చాం" అని పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా శిరీష్ నుంచి శుభలేఖ అందుకుంటున్న సమయంలో చిరంజీవి చేతికి బ్యాండేజ్‌తో కనిపించారు. దాంతో, చిరంజీవి చేతికి ఏమైంది? అంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఇప్పటికే అల్లు ఇంట్లో పెళ్లి సందడి మొదలైంది. ఇటీవలే 'పసుపు' (హల్దీ) వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామ్ చరణ్, ఉపాసన దంపతులు హాజరై సందడి చేశారు. పసుపు రంగు బంతిపూలతో అల్లు వారి నివాసం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అయితే, తన సోదరుడి హల్దీ వేడుకకు అల్లు అర్జున్ హాజరు కాలేకపోయారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ, 'నేను అక్కడ లేకపోవడం మిస్ అవుతున్నాను' అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కొద్ది రోజుల క్రితం దుబాయ్‌లో అల్లు అర్జున్, స్నేహారెడ్డి తదితరుల సమక్షంలో అల్లు శిరీష్, నయనికాల ప్రీ-వెడ్డింగ్ యాచ్ట్ పార్టీ జరిగిన విషయం తెలిసిందే. ఇప్పుడు శుభలేఖల పంపిణీ మొదలవడంతో త్వరలోనే పెళ్లి తేదీపై స్పష్టత రానుంది.



# రైతులకు రాహుల్ అబద్ధాలు

**ట్రేడ్ డీల్స్‌పై తప్పుదోవ పట్టించే చర్యలు.. కాంగ్రెస్ అగ్రనేతపై అమిత్ షా ఫైర్**

గాంధీనగర్: అమెరికా, యూరోపియన్ యూనియన్‌లతో భారత్ ఇటీవల కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల దేశంలోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా ఖండించారు. రైతుల విషయంలో కాంగ్రెస్, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ అబద్ధాలు ప్రచారం చేస్తూ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రతి ఒప్పందంలోనూ వ్యవసాయం, పాడి, మత్స్య రంగాల ప్రయోజనాలకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించిందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గాంధీనగర్‌లో దేశంలోనే తొలి సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ ఆధారిత ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంటులో నిలబడి రాహుల్ గాంధీ రైతుల ప్రయోజనాలను కాపాడతామని మాట్లాడటం నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలను తప్పుదోవ పట్టించడంలో కాంగ్రెస్‌కు సుదీర్ఘ చరిత్ర ఉందని, ఇప్పుడు వాణిజ్య ఒప్పందాల గురించి అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జరిగిన ప్రతి చర్చలోనూ రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాలకు ఎలాంటి హాని కలగకుండా సంపూర్ణ భద్రత కల్పించారని హామీ ఇచ్చారు. గత యూపీఏ ప్రభుత్వంతో పోలుస్తూ తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చేసిన మేలును అమిత్ షా వివరించారు. మన్మోహన్ సింగ్ హయాంలో కేవలం రూ. 26,000 కోట్లుగా ఉన్న వ్యవసాయ బడ్జెట్, ప్రధాని మోదీ నాయకత్వంలో రూ. 1,29,000 కోట్లకు పెరిగిందని గుర్తుచేశారు. గత దశాబ్ద కాలంలో కనీస మద్దతు ధరకు ఆహార ధాన్యాల సేకరణ పదిహేను రెట్లు పెరిగిందని తెలిపారు. “70 ఏళ్లుగా కాంగ్రెస్ రుణమాఫీ గురించి మాట్లాడిందే తప్ప చేసిందేమీ లేదు. కానీ మా ప్రభుత్వం, రైతులు అప్పులపాలు కాకుండా ఉండేందుకు ఏటా రూ. 6,000 నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది” అని ఆయన అన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ పాడి రంగం దెబ్బతింటుందన్న విమర్శలను కూడా ఆయన తిప్పికొట్టారు. ప్రభుత్వం పాడి ఉత్పత్తి రంగాన్ని బలహీనపరచలేదని, మరింత బలోపేతం చేసిందని స్పష్టం చేశారు. అన్ని ఒప్పందాలలోనూ పాడి రంగానికి పూర్తి రక్షణ కల్పించామని పేర్కొన్నారు. ఈ అంశంపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు రావాలంటూ రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు. బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు కూడా ఈ చర్చకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.



# మోదీకి రాహుల్ 5 ప్రశ్నలు

**అమెరికాతో ట్రేడ్ డీల్‌పై క్వశ్చన్స్**

**ఈ ఒప్పందం రైతులకు ద్రోహం చేయడమేనని ఆరోపణ**

న్యూఢిల్లీ: భారత్–అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, మోదీ ప్రభుత్వంపై తన దాడిని మరింత తీవ్రతరం చేశారు. ఈ ఒప్పందం భారత రైతులకు చేసిన ద్రోహమని ఆరోపిస్తూ, ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రధాని నరేంద్ర మోదీకి ఐదు సూటి ప్రశ్నలు సంధించారు. ఈ వివాదాస్పద ఒప్పందంపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వాణిజ్య ఒప్పందం వల్ల జన్యుపరంగా మార్పు చేసిన (జీఎం) పంటలు, సోయా రైతులపై పడే ప్రతికూల ప్రభావాల గురించి రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో రైతులకు అందుబాటులో ఉన్న రక్షణ కవచాలను కేంద్ర ప్రభుత్వం తొలగిస్తోందని ఆరోపించారు. ఈ ఒప్పందం కేవలం నేటి సమస్య కాదని, భవిష్యత్తులో భారత వ్యవసాయ వ్యవస్థపై మరో దేశానికి దీర్ఘకాలికంగా పట్టును అప్పగించడమేనని ఆయన విమర్శించారు. రైతుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ, ప్రధాని మోదీ సమాధానం చెప్పాలంటూ రాహుల్ గాంధీ ఈ ఐదు ప్రశ్నలను లేవనెత్తారు.

**1. డీడీజీ (డిస్టిల్లర్స్ డ్రైడ్ గ్రెయిన్) దిగుమతి చేసుకోవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? అంటే, అమెరికా జీఎం మొక్కజొన్నల నుంచి తీసిన ధాన్యాన్ని మన పశువులకు మేపడమేనా? ఇది మన పాల పరిశ్రమను అమెరికా వ్యవసాయ వ్యవస్థతో అనుసంధానం చేయదా?**

**2. జీఎం సోయా నూనె దిగుమతులకు అనుమతిస్తే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న మన సోయా రైతుల పరిస్థితి ఏంటి? మరోసారి ధరల పతనాన్ని వారు ఎలా తట్టుకుంటారు?**

**3. మీరు చెబుతున్న ‘అదనపు ఉత్పత్తులు’ జాబితాలో ఏముంటాయి? పప్పుధాన్యాలు, ఇతర సున్నితమైన పంటలను కూడా కాలక్రమేణా అమెరికా దిగుమతులకు తెరవాలనే ఒత్తిడికి ఇది సంకేతమా?**

**4. ‘వాణిజ్యేతర అడ్డంకులు’ తొలగించడం అంటే ఏమిటి? జీఎం పంటలపై భారత్ తన వైఖరిని నీరుగార్చాలా? సేకరణను బలహీనపరచాలా? లేదా భవిష్యత్తులో కనీస మద్దతు ధర, బోనస్‌లను నిర్వీర్యం చేయాలా?**

**5. ఒక్కసారి ఈ తలుపు తెరిస్తే, అది ఏటా మరింత పెద్దది కాకుండా ఎలా నివారిస్తాం? రైతులకు తగిన రక్షణ కవచాలు ఉంటాయా? లేక ప్రతి చర్చలోనూ మరిన్ని పంటలను బేరసారాలకు పెడతారా?**

**ఈ ప్రశ్నలకు జవాబులు ఇవ్వాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.**

## మీ ఐడీ కార్డు ఎక్కడ?


**మ్యూనిచ్ భద్రతా సదస్సులో పాక్ ఆర్మీ చీఫ్‌కు చేదు అనుభవం**

మ్యూనిచ్: పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌కు జర్మనీలో ఓ ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. మ్యూనిచ్‌లో జరుగుతున్న అంతర్జాతీయ భద్రతా సదస్సుకు హాజరైన ఆయనను ఓ సెక్యూరిటీ అధికారి అడ్డుకున్నారు. ఆయన తన గుర్తింపు కార్డు (ఐడీ కార్డ్)ను సరిగా ప్రదర్శించలేదని అభ్యంతరం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సదస్సు ప్రాంగణంలోకి ప్రవేశించడానికి కొద్ది క్షణాల ముందు ఈ సంఘటన జరిగింది. అసిమ్ మునీర్ మెడలో ఐడీ కార్డు లేకపోవడంతో, సెక్యూరిటీ అధికారి ఆయనను ఆపారు. దాంతో, మునీర్ పక్కనున్న మరో పాక్ సైనికాధికారి తన చేతిలో ఉన్న కార్డును చూపించడంతో, ఆ సెక్యూరిటీ అధికారి ముందుకు పోయేందుకు అనుమతించారు. ఈ చిన్నపాటి సంభాషణకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొడుతోంది. ఈ ఘటనపై పలువురు విమర్శకులు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ, అంతర్జాతీయ వేదికలపై ఆయనకున్న గౌరవం ఇదేనంటూ వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు, అసిమ్ మునీర్‌ను ఇలాంటి సదస్సులకు ఆహ్వానించడం ఏంటంటూ పలువురు నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. జియే సింధ్ ముత్తాహిదా మహజ్ చైర్మన్ షఫీ బుర్ఫత్ మాట్లాడుతూ, మునీర్‌ను యూరప్‌లోని భద్రతా వేదికలకు పిలవడం పాకిస్థాన్‌లో అణచివేతకు గురవుతున్న సింధీ, బలూచ్, పష్తూన్ వర్గాలను అవమానించడమేనని అన్నారు. “పాకిస్థాన్ రాజకీయాలు, న్యాయవ్యవస్థ, మీడియాను సైనిక బూట్ల కింద నలిపివేస్తున్న మునీర్ శాంతికి ప్రాతినిధ్యం వహించలేరు. ఆయనపై బలవంతపు అదృశ్యాలు, చిత్రహింసలు, హత్యల వంటి తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి” అని బుర్ఫత్ ఆరోపించారు.

## గ్రహాంతర జీవులున్నాయి.. కానీ!

**అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా**

న్యూయార్క్: ఏదో ఒక గ్రహంపై గ్రహాంతరవాసులు ఉన్నారనే విషయాన్ని తాను బలంగా విశ్వసిస్తున్నానని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా అన్నారు. ఓ పాడ్‌కాస్ట్‌లో ఆయన మాట్లాడుతూ, ఏలియన్స్‌ను ఏరియా 51లో అమెరికా నిర్బంధించిందనే విమర్శలను ఆయన ఖండించారు. ఆ ఊహాగానాల్లో ఎలాంటి నిజం లేదని అన్నారు. దీనిని నిరూపించడానికి ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. దశాబ్దం క్రితం యూఎస్ ఎయిర్ ఫోర్స్ రీపర్ డ్రోన్లు సేకరించిన రాడార్ రికార్డింగ్‌లలో మధ్యప్రాచ్యంలోని కొన్ని ప్రాంతాలపై అసాధారణ జీవుల ఉనికి కనిపించిందని పలు నివేదికలు సూచిస్తున్నాయి. దీనిపై కూడా ఒబామా స్పందించారు. గ్రహాంతర వాసుల ఉనికికి సంబంధించిన పలు రికార్డులు అమెరికా ప్రభుత్వం వద్ద ఉన్నట్లు తాను అధికారంలో ఉన్న సమయంలో కూడా సమాచారం లేదని అన్నారు. అమెరికాలోని నెవాడలో ఉన్న ‘ఏరియా 51’ అత్యంత రహస్య ప్రాంతం. ఇక్కడ అమెరికా సైన్యం, శాస్త్రవేత్తలు, ఆయుధాలు సహా పలు రకాల సాంకేతికతలను పరీక్షిస్తారు. సైనిక శిక్షణ కూడా ఇస్తారు. ఈ స్థావరాన్ని 1955లలో ఏర్పాటు చేశారు. నెవాడ ప్రాంతంలో 200 కిలోమీటర్ల విస్తీర్ణంలో ‘ఏరియా 51’ ఉంది




# 17న రింగ్ ఆఫ్ ఫైర్

**వలయాకార సూర్యగ్రహణం.. భారత్‌లో కనిపించదన్న ఖగోళ శాస్త్రవేత్తలు**

న్యూఢిల్లీ: 2026 సంవత్సరంలో ఖగోళ ప్రియులను అలరించేందుకు ఓ అద్భుతమైన ఘట్టం సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 17న వలయాకార సూర్యగ్రహణం ఏర్పడనుంది. దీన్ని ‘రింగ్ ఆఫ్ ఫైర్’ (అగ్ని వలయం) అని పిలుస్తారు. ఇది ఆకాశంలో అద్భుతమైన దృశ్యాన్ని ఆవిష్కరించనుంది. అయితే, ఈ అరుదైన ఖగోళ అద్భుతాన్ని భారతదేశంలో వీక్షించే అవకాశం లేదు. ఇది ప్రధానంగా దక్షిణార్ధ గోళంలో, అదీ అత్యంత మారుమూల ప్రాంతంలో మాత్రమే సంపూర్ణంగా కనిపించనుంది. సూర్యుడికి, భూమికి మధ్య చంద్రుడు వచ్చినప్పుడు సూర్యగ్రహణం ఏర్పడుతుంది. అయితే ఈ గ్రహణం సమయంలో చంద్రుడు తన సాధారణ పరిమాణం కంటే కొంచెం చిన్నగా కనిపించడం వల్ల సూర్యుడిని పూర్తిగా కప్పలేడు. సూర్యుడి మధ్య భాగాన్ని సుమారు 96 శాతం వరకు మాత్రమే అడ్డుకుంటాడు. దీంతో సూర్యుడి అంచులు ఒక ప్రకాశవంతమైన బంగారు వలయంలా కనిపిస్తాయి. దీనినే కంకణాకార గ్రహణం లేదా ‘రింగ్ ఆఫ్ ఫైర్’ అంటారు. ఈ అగ్ని వలయం గరిష్ఠంగా 2 నిమిషాల 20 సెకన్ల పాటు కనువిందు చేయనుంది. ఖుజ కాలమానం ప్రకారం ఫిబ్రవరి 17న ఉదయం 07:01 గంటలకు గ్రహణం ప్రారంభమవుతుంది. ఈ సంపూర్ణ ‘రింగ్ ఆఫ్ ఫైర్’ గ్రహణం అంటార్కిటికా ఖండంలో మాత్రమే స్పష్టంగా కనిపిస్తుంది. అక్కడి కాంకార్డియా, మిర్నీ వంటి పరిశోధనా కేంద్రాల్లో ఉన్న శాస్త్రవేత్తలు, సిబ్బంది మాత్రమే ఈ అద్భుతాన్ని ప్రత్యక్షంగా చూడగలరు. ఆ ప్రాంతాలు సాధారణ పర్యాటకులకు అందుబాటులో ఉండవు. అయితే, దక్షిణాఫ్రికా, టాంజానియా, జింబాబ్వే వంటి ఆఫ్రికా దేశాలతో పాటు అర్జెంటీనా, చిలీ వంటి దక్షిణ అమెరికా దేశాల్లో పాక్షిక సూర్యగ్రహణం కనిపిస్తుంది. భారతదేశంలో ఈ గ్రహణం సంభవించే సమయంలో సూర్యుడు దిగంతం కింద ఉంటాడు. కాబట్టి ఇక్కడ పాక్షికంగా కూడా గ్రహణాన్ని చూసే అవకాశం లేదు. అయితే, నాసా వంటి అంతరిక్ష సంస్థలు ప్రసారం చేసే ఆన్‌లైన్ లైవ్ స్ట్రీమ్‌ల ద్వారా భారతీయులు ఈ ఖగోళ అద్భుతాన్ని వీక్షించవచ్చు. గ్రహణాన్ని ప్రత్యక్షంగా చూసేవారు తప్పనిసరిగా ప్రత్యేకమైన సోలార్ ఫిల్టర్ కళ్లద్దాలు వాడాలి. నేరుగా చూడటం కళ్లకు తీవ్ర హాని కలిగిస్తుంది.

## చమురు కొనుగోళ్లలో భారత్‌ది స్వతంత్ర నిర్ణయం

**కేంద్రమంత్రి జైశంకర్ స్పష్టీకరణ**

న్యూఢిల్లీ: రష్యా నుంచి చమురు కొనుగోలుకు సంబంధించి కేంద్ర మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో రాజకీయ ఒత్తిళ్లు పని చేయవని ఆయన స్పష్టం చేశారు. అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేసిందంటూ అమెరికా ప్రకటించింది. ఈ నేపథ్యంలో జైశంకర్ స్పందించారు. ఇంధన కొనుగోళ్ల అంశం జాతీయ ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుందని అన్నారు. జర్మనీలోని మ్యూనిచ్ భద్రతా సమావేశంలో పాల్గొన్న ఆయన ఓ ప్రశ్నకు బదులిస్తూ, చమురు కొనుగోళ్ల విషయంలో భారత్ చాలా స్వతంత్రంగా వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు. భారత్ తన వ్యూహాత్మక ప్రయోజనాలకు కట్టుబడి ఉందని అన్నారు. ఇంధన సమస్యల విషయానికి ప్రస్తుతం మార్కెట్ సంక్లిష్టంగా ఉందని వెల్లడించారు. చమురు కొనుగోళ్లకు సంబంధించి భారత్‌లోని కంపెనీలు యూరోప్‌తో సహా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలను పరిశీలిస్తాయని అన్నారు. ఖర్చులు, నష్టాలు, లభ్యతను చూసి వారి ప్రయోజనాలకు తగినట్లు కొనుగోళ్లు జరుపుతారని వెల్లడించారు.

## సిద్ధరామయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన డీకే

హావేరీ: కర్ణాటక రాజకీయాల్లో డీకే శివకుమార్, సిద్ధరామయ్య మధ్య సీఎం పదవి కోసం గత కొంత కాలంగా ఒక రకమైన పోటీ నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో, తాజాగా ఓ ఆశ్చర్యకరమైన సంఘటన చోటుచేసుకుంది. కర్ణాటకలోని హావేరీలో జరిగిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నిలువెత్తు విగ్రహాన్ని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్వయంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు ఉందనే ప్రచారానికి పూర్తి చెక్ పెట్టినట్లు కనిపిస్తోంది. సిద్ధరామయ్య నాయకత్వంలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ విగ్రహావిష్కరణ జరిగింది. పార్టీలో ఐక్యతను, సమష్టి కృషిని ప్రజలకు చాటడమే ఈ కార్యక్రమం లక్ష్యమని డీకే శివకుమార్ స్పష్టం చేశారు. గ్యారంటీ పథకాల అమలులో సిద్ధరామయ్య పోషించిన పాత్రను కొనియాడుతూ, ఆయన చరిత్రలో ప్రజా నాయకుడిగా నిలిచిపోతారని అన్నారు.




# ఏఐ లీడర్‌గా భారత్

**చాట్ జీపీటీ సృష్టికర్త శామ్ ఆల్ట్‌మన్**

న్యూఢిల్లీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ఒక పూర్తిస్థాయి లీడర్‌గా ఎదిగే సత్తా ఉందని చాట్‌జీపీటీ సృష్టికర్త ‘ఓపెన్‌ఏఐ’ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ ప్రశంసించారు. అందుకు అవసరమైన వనరులన్నీ భారత్ వద్ద ఉన్నాయని అన్నారు. భారత్‌లో చాట్‌జీపీటీని వారానికి 10 కోట్ల మంది యాక్టివ్ యూజర్లు ఉపయోగిస్తున్నారని, ఇది తమకు ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అని ఆయన వెల్లడించారు. ఫిబ్రవరి 16 నుంచి న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ప్రారంభం కానున్న ‘గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026’ నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక మీడియా కథనంలో ఆయన మాట్లాడుతూ, అమెరికా తర్వాత భారత్‌లోనే తమకు అత్యధిక యూజర్లు ఉన్నారని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక విద్యార్థి యూజర్లు కూడా భారత్ నుంచే ఉన్నారని, శాస్త్రీయ పరిశోధనల కోసం ఉద్దేశించిన ‘ప్రిజమ్’ అనే ఉచిత టూల్ వినియోగంలో భారత్ ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉందని వివరించారు. వచ్చే వారం తాను భారత్‌లో పర్యటించనున్నట్లు ఆల్ట్‌మన్ తెలిపారు. ఏఐని “భారత్‌లోనే, భారత్‌తోనే, భారత్ కోసమే” అభివృద్ధి చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. గతేడాది ఢిల్లీలో తొలి కార్యాలయాన్ని ప్రారంభించామని, ఈ ఏడాది కార్యకలాపాలను మరింత విస్తరించాలని యోచిస్తున్నట్లు చెప్పారు. ఏఐ ప్రయోజనాలను అందరికీ అందించేందుకు ప్రభుత్వంతో కొత్త భాగస్వామ్యాలు కుదుర్చుకునే అవకాశాలు ఉన్నాయని ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా ఏఐని క్షేత్రస్థాయికి చేర్చడానికి ‘యాక్సెస్, అడాప్షన్, ఏజెన్సీ’ అనే త్రిముఖ వ్యూహాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. ఇటీవలే నాలుగు భారతీయ నగరాల్లో 200 మందికి పైగా ఎన్జీవో ప్రతినిధులకు చాట్‌జీపీటీ వినియోగంపై శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## పాత సిమ్ కార్డుల నుంచి రూ.27 లక్షల బంగారం!

**రెండు టన్నుల ఈ-వేస్ట్ నుంచి 191 గ్రాముల బంగారం సేకరణ**



బీజింగ్: పనికిరానివని పడేసే పాత సిమ్ కార్డులు, ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ–వేస్ట్) నుంచి ఓ వ్యక్తి ఏకంగా రూ. 27 లక్షల విలువైన బంగారం తీసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌కు చెందిన కియావో అనే వ్యక్తి ఈ ఘనత సాధించాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే, ప్రొఫెషనల్ స్క్రాప్ మెటల్ రీఫైనర్ అయిన కియావో, దాదాపు రెండు టన్నుల పాత టెలికాం చిప్‌లు, సిమ్ కార్డులు వంటి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించాడు. వీటి నుంచి క్లిష్టమైన రసాయన ప్రక్రియ ద్వారా సుమారు 191 గ్రాముల స్వచ్ఛమైన బంగారాన్ని వెలికితీశాడు. దీని విలువ దాదాపు 2 లక్షల యువాన్లు, అంటే భారత కరెన్సీలో సుమారు రూ. 26 నుంచి 27 లక్షల వరకు ఉంటుందని అంచనా. జనవరి 20న తాను ఈ ప్రక్రియ చేస్తున్న వీడియోను పంచుకోగా, అది 5 మిలియన్లకు పైగా వీక్షణలు పొందింది. ఈ–వేస్ట్‌ను రసాయనాల్లో ముంచి, వేడి చేసి, ఫిల్టర్ చేయడం ద్వారా బంగారాన్ని వేరు చేసినట్టు కియావో చూపించాడు. అయితే, ఇది చాలా ప్రమాదకరమైన ప్రక్రియ అని, ఇందులో వాడే రసాయనాల వల్ల ప్రాణాంతక వాయువులు వెలువడతాయని హెచ్చరించాడు. తన నైపుణ్యాన్ని ప్రదర్శించడానికే ఈ వీడియో పోస్ట్ చేశానని, సామాన్యులు ఎవరూ దీన్ని ప్రయత్నించవద్దని స్పష్టం చేశాడు. చైనాలో ఇలా బంగారం శుద్ధి చేయడంపై కఠినమైన నిబంధనలు ఉన్నాయి. అనుమతి లేనిదే దీన్ని చేస్తే భారీ జరిమానాలు, జైలు శిక్ష పడతాయి. అయితే, తనకు అధికారికంగా లైసెన్స్ ఉందని కియావో పేర్కొన్నాడు. ఈ వీడియో వైరల్ అయిన తర్వాత, చైనాలో పాత సిమ్ కార్డులు, గోల్డ్–రిఫైనింగ్ కిట్‌లకు ఆన్‌లైన్‌లో డిమాండ్ అమాంతం పెరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి.

## తారిఖ్ ప్రమాణానికి భారత్ నుంచి ఓం బిర్లా

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత ప్రభుత్వం తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 17న రాజధాని ఢాకాలో జరగనున్నట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల జరిగిన బంగ్లాదేశ్ పార్లమెంటరీ ఎన్నికల్లో తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ కీలక కార్యక్రమంలో స్పీకర్ పాల్గొనడం ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న బలమైన, చిరకాల స్నేహానికి నిదర్శనమని విదేశాంగ శాఖ తెలిపింది. “చరిత్ర, సంస్కృతి, పరస్పర గౌరవంతో ముడిపడి ఉన్న పొరుగు దేశంగా, తారిఖ్ రెహమాన్ నాయకత్వంలో ఏర్పడుతున్న ఎన్నికైన ప్రభుత్వాన్ని భారత్ మనస్ఫూర్తిగా స్వాగతిస్తోంది. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉన్న బంగ్లాదేశ్‌కు మా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుంది” అని ప్రకటనలో పేర్కొంది. ఫిబ్రవరి 12న 300 స్థానాలకు గాను 299 స్థానాలకు పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్ జరిగింది. ఇప్పటివరకు ప్రకటించిన ఫలితాల ప్రకారం, బీఎన్‌పీ 209 సీట్లు గెలుచుకుంది. మరోవైపు, జమాత్–ఎ–ఇస్లామీ 68 స్థానాలు కైవసం చేసుకుంది. ప్రముఖ బంగ్లాదేశ్ పత్రిక ‘ప్రొథోమ్ ఆలో’ కథనం ప్రకారం, ఫలితాలు నిలిపివేసిన రెండు నియోజకవర్గాల్లోనూ బీఎన్‌పీ అభ్యర్థులే ఆధిక్యంలో ఉన్నారు. ఫిబ్రవరి 17న జాతీయ సంసద్ భవన్‌లో కొత్తగా ఎన్నికైన సభ్యులతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎ.ఎం.ఎం. నసీరుద్దీన్ ప్రమాణం చేయించనున్నారు. దాదాపు 35 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్‌కు ఒక పురుషుడు ప్రధానమంత్రి కానున్నారు. అయితే, గత 18 నెలల తాత్కాలిక ప్రభుత్వ హయాంలో పెరిగిన అశాంతి, తీవ్రవాదాన్ని అధిగమించడం కొత్త ప్రభుత్వానికి అతిపెద్ద సవాల్‌గా నిలవనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## స్వతంత్రంగానే పోటీ: విజయ్

చెన్నై: తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. ఇప్పటికే అన్ని పార్టీలు ఎన్నికల మూడ్ లోకి వెళ్లిపోయాయి. తమిళనాడులో సాధారణంగా డీఎంకే, అన్నాడీఎంకే పార్టీల మధ్య ప్రధాన పోరు ఉంటుంది. కానీ, ఇప్పుడు రాబోతున్న ఎన్నికలు మరింత రసవత్తరంగా మారాయి. ప్రముఖ సినీ నటుడు విజయ్ తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టడమే దీనికి కారణం. తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని స్థాపించిన విజయ్... అధికార డీఎంకేను కూల్చడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. తాజాగా ఆయన మాట్లాడుతూ... పొత్తులకు సంబంధించి ఫుల్ క్లారిటీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో రెండు ప్రధాన జాతీయ కూటములతో (ఎన్డీయే, యూపీఏ) పొత్తు పెట్టుకోబోమని, స్వతంత్రంగానే ఎన్నికల్లో పోటీ చేస్తామని విజయ్ ప్రకటించారు.

ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
సోమవారం 16-2-2026 www.evarthalu.com



నభా నటేష్

## రేవంత్ రెడ్డితో విజయ్ దేవరకొండ భేటీ

### పెళ్లికే ఆహ్వానించారా.. అతిథులు వీళ్లే!



రష్మిక మందన్న – విజయ్ దేవరకొండ పెళ్లి వార్త ఇప్పుడు క్లైమాక్స్‌కు చేరుకుంది. ఎప్పుడు అడిగినా మేము కేవలం స్నేహితులం అని దాటవేస్తూ వచ్చిన ఈ జంట, ఇప్పుడు ఏకంగా ఏడడుగులు వేయడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి చివరి వారంలో వీరి వివాహ వేడుక జరగనుందనే వార్త సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. దీనికి తోడు తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విజయ్ దేవరకొండ కలవడం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలోనే ఈ మోస్ట్ వాంటెడ్ సెలబ్రిటీ వెడ్డింగ్‌కు సంబంధించిన అతిథుల వివరాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రేజీ జంట రిసెప్షన్‌కు సౌత్ ఇండియా నుంచి బాలీవుడ్ వరకు స్టార్ల సందడి ఉండబోతోంది. ముఖ్యంగా విజయ్‌కు అత్యంత సన్నిహితుడైన డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవనున్నారు. రష్మిక, విజయ్‌లతో కలిసి పనిచేసిన ప్రముఖ దర్శకులు, నిర్మాతలు ఈ వేడుకకు హాజరుకానున్నారు. బాలీవుడ్ నుంచి కూడా కొందరు స్టార్ హీరోలు, హీరోయిన్లు ఈ వేడుకలో మెరిసే అవకాశం ఉంది. ఉదయ్‌పూర్ పెళ్లిని ఎంత సీక్రెట్‌గా ఉంచాలని చూసినా, హైదరాబాద్ రిసెప్షన్ మాత్రం కంటికి పండుగలా, తారల మెరుపులతో అట్టహాసంగా సాగనుందని తెలుస్తోంది.



## భాషా మూవీ నిర్మాత కన్నుమూత




సూపర్ స్టార్ రజినీకాంత్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిన 'బాషా' సినిమాను నిర్మించిన ప్రముఖ నిర్మాత, దర్శకుడు తమిళ్ అళగన్ గారు కన్నుమూశారు. కేవలం నిర్మాతగానే కాకుండా, ఆయన వెనుక ఉన్న రాజకీయ, సినిమా నేపథ్యం తెలిస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. ఆయన మరణవార్త విని రజినీకాంత్ సహా ఇండస్ట్రీ మొత్తం తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. తమిళ్ అళగన్ బ్యాక్‌గ్రౌండ్ చాలా పవర్‌ఫుల్. ఆయన మరెవరో కాదు, తమిళనాడులో లెజెండరీ ప్రొడ్యూసర్, ప్రముఖ రచయిత మరియు మాజీ మంత్రిగా పనిచేసిన ఆర్.ఎమ్. వీరప్పన్ కుమారుడు. ఇక అంతటి రాజకీయ ప్రాబల్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినా, అళగన్ గారికి సినిమా రంగంపై ఉన్న మక్కువతో ఇటు వైపు అడుగులు వేశారు. తండ్రి వారసత్వాన్ని పుచ్చుకుని నిర్మాణ రంగంలోనే కాకుండా, దర్శకుడిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. ఒక పక్క రాజకీయ పలుకుబడి ఉన్నా, ఎప్పుడూ సినిమా క్రియేటివిటీకే ఆయన ప్రాధాన్యతనిచ్చేవారు. ఆయన క్రమశిక్షణే ఇండస్ట్రీలో ఆయనకు ఇంతటి పేరు తెచ్చిపెట్టింది.

## మోదీ అంటేనే ఇష్టం

బాలీవుడ్ నటి తాప్సీ పన్ను తన ముక్కుసూటితనానికి పెట్టింది పేరు. ఏ విషయంపైనైనా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే ఆమె, తాజాగా ఓ టీవీ షోలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. రాజకీయ నాయకులపై అడిగిన ప్రశ్నకు ఆమె ఇచ్చిన సమాధానం అటు ప్రేక్షకులను, ఇటు నెటిజన్లను ఆశ్చర్యానికి గురిచేసింది. టీవీ9 భారత్‌వర్ష్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న తాప్సీని యాంకర్ ఒక ఆసక్తికరమైన ప్రశ్న అడిగారు. "మీకు ఇష్టమైన రాజకీయ నాయకుడు ఎవరు? నరేంద్ర మోదీనా లేక రాహుల్ గాంధీనా?" అని ప్రశ్నించారు. దానికి తాప్సీ క్షణం కూడా ఆలోచించకుండా.. "నరేంద్ర మోదీ" అని సమాధానం ఇచ్చారు. అయితే, ఆమె అంతటితో ఆగలేదు. మోదీని ఎంచుకోవడానికి గల కారణాన్ని చెబుతూ.. 'నేను ఇంకా ఈ దేశంలోనే బతకాలి కదా' అంటూ నవ్వుతూ వ్యాఖ్యానించారు. ఆమె సమాధానం వినగానే అక్కడున్న వారంతా పగలబడి నవ్వారు. ఇది కేవలం సరదాగా అన్నారా లేక పరోక్షంగా సెటైర్ వేశారా అనేది ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అంతకుముందు, 'మీకు నచ్చిన మహిళా నేత ఎవరు?' అనే ప్రశ్నకు మమతా బెనర్జీ, స్మృతి ఇరానీ, మాయావతి, ప్రియాంక గాంధీ పేర్లను ఆప్షన్లుగా ఇచ్చారు. దానికి తాప్సీ, సుష్మా స్వరాజ్ పేరును ప్రస్తావించినప్పటికీ, ఇచ్చిన ఆప్షన్లలో స్మృతి ఇరానీని ఎంచుకున్నారు.





## బ్యాక్ ఫొటోలు వద్దు


స్టార్లతో సన్నిహితంగా మెలగుతూ, వారిని అందంగా చిత్రీకరించాలనే తపన స్టిల్ ఫోటోగ్రాఫర్లకు ఉండవచ్చు. కానీ ఒక్కోసారి హద్దు మీరి ప్రవర్తిస్తే మాత్రం అది అభాసుపాలవుతోంది! అలాంటి ఫోటోగ్రాఫర్లపై విరుచుకుపడే భామలు ఉన్నారు. తాజాగా ఓ ఫోటోగ్రాఫర్ ని నిలదీస్తూ.. డ్యాన్సింగ్ క్వీన్ ఆయేషా ఖాన్ ఫైరైన ఘటన ప్రస్తుతం బాలీవుడ్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ముంబైలో జరిగిన –తు యా మే– సినిమా స్పెషల్ స్క్రీనింగ్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. స్క్రీనింగ్ కోసం వచ్చిన ఆయేషా ఖాన్ రెడ్ కార్పెట్ మీద ఫోటోలకు పోజులు ఇస్తుండగా కొందరు ఫోటోగ్రాఫర్లు ఆమెను వెనుక వైపు నుండి వీడియో రికార్డ్ చేయడానికి ప్రయత్నించారు.

## శివుడిపై రాఖీ ఖన్నా పాట

మహాశివరాత్రి వేళ అభిమానులను సర్‌ప్రైజ్ చేసింది రాశీఖన్నా. శివుడిపై తనకున్న భక్తిని పాట రూపంలో చాటుకుంది. సింగర్‌గా మారిన రాశీఖన్నా శివ్ కైలాషోం కే వాసి అనే పాటను పాడింది. శివతత్వాన్ని చాటిచెప్పే ఈ పాటలో రాశీఖన్నా స్వయంగా నటించింది. మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం తాను పాడిన పాటను సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంది. రాశీఖన్నా పాడిన ఈ పాట సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'శివ్ కైలాషోం కే వాసి' అనేది అహంకారాన్ని నాశనం చేయడంతో అంతరంగాన్ని మేల్కొల్పుతూ.... అతీంద్రియత శక్తి అయిన అయిన మహా దేవుడి మీద భక్తిని చాటేలా ఉంటుందని రాశీఖన్నా అన్నది. విశిష్టమైన మహాశివరాత్రి రోజున పాట పాడటం ఎంతో ఆనందంగా ఉందని తెలిపింది. రాశీఖన్నా స్వరం, పాటలో ఆమె కనిపించిన తీరు, పలికించిన భావోద్వేగాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ పాటకు సోహమ్ సుతర్ దర్శకత్వం వహించాడు. స్పర్శ్, జెహీష్, తనిష్క్ సేథ్, వ్యాంపైర్ మ్యూజిక్ కలిసి సంగీతం అందించారు. వేదాన్ష్ శశ్వాత్ మిశ్రా మ్యూజిక్ సూపర్‌విజన్ అందించాడు. రాశీఖన్నా సింగర్‌గా మారడం ఇదే ఫస్ట్ టైమ్ కాదు. గతంలో పలు జోరు, జవాన్, ప్రతిరోజు పండగేతో పాటు మరికొన్ని సినిమాల్లో పాటలు పాడింది.

## ఇరుముడిలో ప్రియా భవానీ శంకర్

టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ, సెన్సిబుల్ డైరెక్టర్ శివ నిర్వాణ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ మూవీ 'ఇరుముడి'పై ఇప్పటికే మంచి హైప్ క్రియేట్ అయ్యింది. అసలు ఎవరు ఊహించని విధంగా అయ్యప్ప మాల టైటిల్ తోనే ఈ సినిమా డిఫరెంట్ ఏమోషన్ తో రానున్నట్లు తెలుస్తోంది. రవితేజ కెరీర్‌లో ఇది 77వ ప్రాజెక్ట్. ఇక మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదలైన రవితేజ అయ్యప్ప మాల లుక్ ప్రేక్షకుల్లో ఒక కొత్త రకమైన క్యూరియాసిటీని పెంచగా, తాజాగా మహా శివరాత్రి సందర్భంగా చిత్రబృందం మరో క్రేజీ అప్‌డేట్‌ను విడుదల చేసింది. సినిమాలో హీరోయిన్ ఎవరనే సస్పెన్స్‌కు తెరదించుతూ.. ప్రియా భవానీ శంకర్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. పల్లెటూరి వాతావరణం ఉట్టిపడేలా ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే, 'ఇరుముడి' ఒక పక్కా లోకల్ ఎమోషనల్ అండ్ క్యూట్ డ్రామా అని అర్థమవుతోంది. రవితేజ చాలా రోజులకు తన పాత మాస్ లుక్ వదిలి, కాస్త రగ్గడ్ అండ్ నేచురల్ మేకోవర్‌లో కనిపిస్తుండటం ఫ్యాన్స్‌కు ఫుల్ ఖుషీ ఇస్తోంది.






## జాక్విలిన్‌కు 30కోట్ల హెలికాప్టర్

సుకేశ్ చంద్రశేఖర్ జైలు నుంచి తన ప్రియురాలిగా చెప్పుకుంటున్న జాక్విలిన్ ఫెర్నాండెజ్ కి పంపిస్తున్న లేఖలు, ఇస్తున్న ఆఫర్లు ప్రస్తుతం బాలీవుడ్‌లో పెద్ద సెన్సేషన్‌గా మారాయి. ఇప్పుడు ఏకంగా 30కోట్ల విలువైన హెలికాప్టర్ ని వేలెంటైన్స్ డే కానుకగా అందిస్తానని ప్రకటించాడు. వాలెంటైన్స్ డే (ప్రేమికుల రోజు) సందర్భంగా సుకేశ్ రాసిన లేఖలో రూ.30 కోట్ల విలువైన హెలికాప్టర్ గురించి ప్రస్తావించాడు. దానికి జేఎఫ్ (జే–జాక్విలిన్ ఎఫ్–ఫెర్నాండెజ్) అని పేరు కూడా పెట్టానని.. దాని ఫోటోలను కూడా త్వరలో పంపిస్తానని ఆ లేఖలో పేర్కొన్నాడు. కేవలం హెలికాప్టర్ మాత్రమే కాదు.. గతంలో లగ్జరీ కార్లు, డైమండ్ రింగులు, ఖరీదైన బ్యాగులు కూడా ఇస్తానని ఆఫర్ చేశాడు. అంతేకాదు తమ కాపురం కోసం ఒక ఖరీదైన బంగ్లా విదేశాలలో సిద్ధంగా ఉందని కూడా చెప్పాడు.





## ఇషాన్ కిషన్ సరికొత్త చరిత్ర

టీమిండియా ఓపెనర్ ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2007 ఫైనల్ తర్వాత పాకిస్థాన్‌పై హాఫ్ సెంచరీ బాదిన తొలి భారత ఓపెనర్‌గా ఇషాన్ కిషన్ చరిత్రకెక్కాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా కొలంబో వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 40 బంతుల్లో 77 పరుగులు చేయడం ద్వారా ఇషాన్ కిషన్ ఈ ఫీట్ సాధించాడు. బ్యాటింగ్‌కు ప్రతికూలమైన ఈ వికెట్‌పై దూకుడుగా ఆడిన ఇషాన్ కిషన్ 27 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. గత 19 ఏళ్లలో ఏ భారత ఓపెనర్ కూడా పాకిస్థాన్‌పై టీ20 ప్రపంచకప్‌లో హాఫ్ సెంచరీ సాధించలేదు. చివరిసారిగా 2007 టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో గౌతమ్ గంభీర్ ఓపెనర్‌గా వచ్చి పాకిస్థాన్‌పై హాఫ్ సెంచరీ (75 పరుగులు) సాధించాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఏ భారత ఓపెనర్‌కు హాఫ్ సెంచరీ సాధించలేదు. రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, కేఎల్ రాహుల్ ఓపెనర్‌గా బరిలోకి దిగినా పాకిస్థాన్‌పై 50 పరుగులు చేయలేకపోయారు.



# దాయాదిపై దంచేశారు!

## టీ20 ప్రపంచకప్‌లో భారత్ గ్రాండ్ విక్టరీ

### 61 పరుగుల తేడాతో పాక్ చిత్తు.. ఇషాన్ కిషన్ ధనాధన్ బ్యాటింగ్

**టీ20 ప్రపంచకప్‌లో దాయాది పాకిస్తాన్‌తో జరిగిన హైవోల్టేజ్ మ్యాచ్‌లో మరోసారి భారత్ జయకేతనం ఎగుర వేసింది. దాయాది దేశాన్ని మరోసారి భారత్ 61 పరుగుల తేడాతో చిత్తుచేసింది. ఐసీసీ టోర్నీలో మరోసారి పాకిస్తాన్‌పై తిరుగులేని రికార్డును కొనసాగించింది. ఈ టీ20 వరల్డ్ కప్‌లో టీమిండియా వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసి గ్రూప్-లో నుంచి సూపర్-8లోకి ప్రవేశించింది.**

**భారత్ విధించిన 176 పరుగుల లక్ష్యంతో.. బ్యాటింగ్ ప్రారంభించిన పాక్‌కు తొలి రెండు ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయింది. తొలి ఓవర్ వేసిన హార్దిక్ పాండ్యా పాకిస్తాన్‌కు షాక్ ఇచ్చాడు. నాలుగో బంతికే సాహిబ్జాదా ఫర్హాన్ పెవిలియన్‌కు పంపాడు.**



ఆ తర్వాత జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో తొలి బంతికి సిక్సర్ కొట్టిన సైమ్ అయూబ్ (6) ఆ తర్వాత బంతికే వికెట్ల ముందు దొరికిపోయాడు. అదే ఓవర్ చివరి బంతికి కెప్టెన్ సల్మాన్ అఘా (4) రింకు సింగ్‌కు క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. నాలుగు ఓవర్లు ముగిసిన తర్వాత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అక్షర్ పటేల్‌ను బౌలింగ్‌కు దింపాడు. అక్షర్ పటేల్ తొలి ఓవర్‌లోనే వికెట్ పడగొట్టాడు. అక్షర్ తాను వేసిన మొదటి ఓవర్ నాలుగో బంతికే బాబర్ అజామ్ (5)ని క్లీన్ బౌల్డ్ చేశాడు. టీమిండియా బౌలర్ల ధాటికి పాక్ పవర్ ప్లేలో కేవలం నాలుగు వికెట్ల నష్టానికి 38 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆ తర్వాత షాదాబ్ ఖాన్‌తో కలిసి ఉస్మాన్ ఖాన్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఐదో వికెట్‌కు 39 పరుగులు జోడించారు. అక్షర్ తన చివరి ఓవర్‌లో ఉస్మాన్ (44) పెవిలియన్‌కు పంపాడు. అక్షర్ వేసిన బంతిని ఆడేందుకు ఉస్మాన్ ముందుకు రాగా.. బంతి వెళ్లి ఇషాన్ చేతుల్లో పడింది. దాంతో క్షణాల్లోనే స్టంప్ అవుట్ చేశాడు. మరుసటి ఓవర్‌లో కుల్దీప్ బౌలింగ్‌లో మహ్మద్ నవాజ్ (4) శివం దూబేకు క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. అనంతరం కెప్టెన్ తిలక్ వర్మను బౌలింగ్‌కు దింపాడు. తిలక్ తొలి ఓవర్ తొలి బంతికే షాదాబ్ ఖాన్ పెవిలియన్ బాట పట్టాడు. 13 ఓవర్లు ముగిసే సరికి ఏడు వికెట్ల నష్టానికి 78 పరుగులు చేసింది. విజయానికి 98 పరుగుల దూరంలో నిలిచింది. చివరిలో ఫహీం అష్రఫ్ (10), అబ్రార్ (0)లను వరుణ్ చక్రవర్తి పెవిలియన్ పంపాడు. ఇద్దరిని వరుస బంతుల్లో అవుట్ చేసి వరుణ్.. తృటిలో హ్యాట్రిక్ మిస్సయ్యాడు. 16 ఓవర్‌లో మూడు, నాలుగు బంతుల్లో ఇద్దరిని అవుట్ చేసి వరుణ్.. ఐదో బంతిని ఉస్మాన్ తారిక్‌కు వేయగా.. ఆడలేకపోయాడు. టీమిండియా ఎల్‌బీ కోసం అప్పీల్ చేసింది. అంపైర్ ధర్మసేన తిరస్కరించాడు. టీమిండియా రివ్యూకు వెళ్లినా నాటౌట్‌గా తేలింది. ఇక చివరగా 18 ఓవర్ చివరి బంతికి తారిక్‌ను పాండ్యా క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో పాక్ 114 పరుగులకే కుప్పకూలింది. టీమిండియా బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, హార్దిక్ పాండ్యా తలా రెండు వికెట్లు పడగొట్టగా.. కుల్దీప్ యాదవ్, తిలక్ వర్మకు ఒక్కో వికెట్ దక్కింది. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ఇటీవల ఫుల్ ఫామ్‌లోనూ ఉన్న ఇషాన్ మరోసారి హాఫ్ సెంచరీతో చెలరేగాడు. ఫోర్లు సిక్సర్లతో పాక్ బౌలర్లను ఉతికి ఆరేశాడు. సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, శివం దూబే రాణించడంతో భారీ లక్ష్యాన్ని పాక్ ఎదుట ఉంచింది. అయితే, భారత్‌కు మాత్రం ఆరంభం కలిసిరాలేదు. విధ్వంసక ఓపెనర్ అభిషేక్ మరోసారి తీవ్రంగా నిరాశ పరిచాడు. సల్మాన్ అఘా వేసిన తొలి ఓవర్‌లోనే డకౌట్ అయ్యాడు. అనంతరం తిలక్ వర్మతో కలిసి ఇషాన్ కిషన్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. బ్యాటింగ్‌కు ప్రతీకూలంగా ఉన్నా.. దూకుడు ఆడుతూ పాక్ బౌలర్లపై ఒత్తిడి పెంచాడు. పవర్ ప్లేలో వికెట్ నష్టానికి భారత్ 52 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ 40 బంతుల్లో 77 పరుగులు చేశాడు. ఇషాన్‌తో పాటు సూర్యకుమార్ (32), శివమ్ దూబే (27), తిలక్ వర్మ (25) పర్వాలేదనిపించారు. ఓ దశలో భారత్ 200 పరుగులు చేసేలా కనిపించింది. కానీ, స్పిన్నర్లు ఉస్మాన్ తారిక్, సైమ్ అయూబ్ భారత బ్యాట్స్‌మెన్స్‌ని కట్టడి చేశారు. సైమ్ అయుబ్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఉస్మాన్ తారిక్, సల్మాన్ అఘా, షాహిన్ షా అఫ్రిదిలకు చెరో ఒక వికెట్ దక్కింది. ఐసీసీ ఈవెంట్లలో పాక్‌పై భారత్ తిరుగులేని రికార్డును కొనసాగిస్తూ వస్తోంది. టీ20 ప్రపంచకప్‌లలో ఇప్పటి వరకు దాయాదిని భారత్ ఎనిమిదో సారి మట్టి కరిపించింది. గత దశాబ్దకాలంగా రెండు జట్లు ద్వైపాక్షిక సిరీస్‌లో ఆడని విషయం తెలిసిందే. రెండు జట్లు కేవలం ఐసీసీ, ఆసియా టోర్నీల్లో మాత్రమే తలపడుతున్నాయి. భారత్-పాక్ మధ్య ఇప్పటి వరకు తొమ్మిది సార్లు పోటీపడ్డాయి. భారత్ ఎనిమిది సార్లు విజయం సాధించింది. 2021 టీ20 ప్రపంచకప్‌లో మాత్రమే పాకిస్తాన్ విజయం సాధించింది. 2007 టీ20 ప్రపంచకప్‌లో తొలిసారిగా పాకిస్తాన్‌ను ఓడించి ప్రపంచకప్‌ని నెగ్గింది. 2007లో గ్రూప్ దశలో, మళ్లీ ఫైనల్‌లో పాకిస్తాన్‌ను మట్టి కరిపించింది. ఆ సమయంలో ఫైనల్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 141 పరుగులు చేసింది. 142 పరుగుల టార్గెట్‌తో బ్యాటింగ్‌కు దిగిన పాక్ సైతం ఏడు వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. దాంతో బౌల్డ్ అవుట్‌లో టీమిండియా విజయం సాధించింది మహేంద్ర సింగ్ ధోనీ నేతృత్వంలోని తొలిసారిగా టైటిల్‌ను గెలుచుకుంది. అప్పటి నుంచి 2021లో మినహా పాక్‌పై భారత్ ఆధిపత్యం కొనసాగిస్తూ వచ్చింది.

## పేలవ బ్యాటింగ్ వల్లే ఓటమి

తమ స్పిన్నర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారని పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా అన్నాడు. ప్రణాళికలకు తగ్గట్లు బౌలింగ్ చేయలేకపోయారని చెప్పిన సల్మాన్ అఘా.. బ్యాటింగ్‌లో పవర్ ప్లేలోనే వికెట్లు కోల్పోవడం తమ పతనాన్ని శాసించిందని అభిప్రాయపడ్డాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన పాకిస్థాన్ 61 పరుగుల తేడాతో చిత్తయ్యింది. భారత్ నిర్దేశించిన 176 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 114 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ మ్యాచ్ అనంతరం తమ పరాజయంపై స్పందించిన సల్మాన్ అఘా.. పిచ్ కండిషన్స్‌కు తగ్గట్లు బౌలింగ్, బ్యాటింగ్ చేయలేకపోయామని తెలిపాడు.





## మోడల్‌తో ఇషాన్ పెళ్లి

ఇషాన్ కిషన్ త్వరలోనే వివాహం చేసుకోబోతున్నట్లు ఇషాన్ కిషన్ తాత అనురాగ్ పాండే సంకేతాలిచ్చారు. కొలంబోలోని భారత్-పాక్ కీలక మ్యాచ్‌కు ముందు మీడియా ప్రతినిధులు ఇషాన్ కిషన్ తాతయ్యను పలకరించగా.. ఆయన తన మనవడి ప్రియురాలి గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. జైపూర్‌కు చెందిన ప్రముఖ మోడల్ అదితి హుండియాతో ఇషాన్ కిషన్ ప్రేమలో ఉన్నాడని ఆయన స్పష్టం చేశారు. అదితి ఎవరో కాదు.. గతంలో జరిగిన 'మిస్ ఇండియా' పోటీలలో రన్నరప్‌గా నిలిచింది. అదితి తన ఇంటర్వ్యూలలో కూడా ఇషాన్ గురించి, అతని కుటుంబం గురించి గొప్పగా మాట్లాడిందని ఆయన గుర్తు చేసుకున్నారు. తమ కుటుంబంలో ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ ఉంటుందని.. ఇషాన్ తన జీవిత భాగస్వామిని ఎంచుకునే విషయంలో పూర్తి స్వతంత్రుడని అనురాగ్ పాండే పేర్కొన్నారు. "ఇషాన్ తన అన్నయ్యలాగే తనకు నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు. మా కుటుంబం ఎప్పుడూ పిల్లల ఇష్టాలకే ప్రాధాన్యత ఇస్తుంది. అదితిని మా ఇంటి కోడలిగా ఆహ్వానించడానికి మేమంతా సిద్ధంగా ఉన్నాం." అని అనురాగ్ పాండే పేర్కొన్నారు. అదితికి ఇషాన్ తాతయ్య అంటే చాలా గౌరవమని, ఆయన ముఖం ఎప్పుడూ కాంతివంతంగా వెలిగిపోతుంటుందని ఆమె ఇషాన్‌తో చెప్పినట్లు ఆయన నవ్వుతూ పంచుకున్నారు.

## ఆసీస్‌పై భారత మహిళలు ఘన విజయం

ఆస్ట్రేలియా పర్యటనను భారత మహిళల జట్టు ఘనంగా ప్రారంభించింది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా సిడ్నీ వేదికగా ఆదివారం జరిగిన తొలి టీ20లో టీమిండియా డీఎల్ఎస్ పద్ధతిన 21 పరుగుల తేడాతో విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హైదరాబాద్ పేసర్ అరుంధతి రెడ్డి(4/22) నాలుగు వికెట్లతో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా మహిళల జట్టు 18 ఓవర్లలో 133 పరుగులకు ఆలౌటైంది. జార్జియో వేర్‌హమ్(19 బంతుల్లో 4 ఫోర్లతో 30), ఫోబె లిచిఫీల్డ్(19 బంతుల్లో 5 ఫోర్లతో 26), ఎల్లిస్ పెర్రీ(20) టాప్ స్కోరర్లుగా నిలిచారు. అయితే ఈ ముగ్గురిని అరుంధతి రెడ్డినే పెవిలియన్ చేర్చింది. ఆమెతో పాటు శ్రీచరణి(2/14), రేణుక సింగ్(2/14) రెండేసి వికెట్లు తీయగా.. క్రాంతి గౌడ్, దీప్తి వర్మ చెరో వికెట్ తీసారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత మహిళల జట్టు వర్షం అంతరాయం కలిగించే సమయానికి 5.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 50 పరుగులు చేసింది. షెఫాలీ వర్మ(11 బంతుల్లో ఫోర్, 2 సిక్సలతో 21) దూకుడుగా ఆడే క్రమంలో ఔటైనా.. స్మృతి మంధాన(17 బంతుల్లో 2 ఫోర్లతో 16), జెమీమా రోడ్రిగ్స్(3 బంతుల్లో 2 ఫోర్లతో 9 నాటౌట్) అజేయంగా నిలిచారు. వర్షం ఎంతకీ ఆగకపోవడంతో అంపైర్లు డీఎల్ఎస్ పద్ధతిన మ్యాచ్ ఫలితాన్ని తేల్చారు. ఈ లెక్క ప్రకారం భారత్ 21 పరుగుల ముందంజలో ఉండటంతో విజేతగా ప్రకటించారు. ఈ గెలుపుతో మూడు టీ20ల సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య రెండో టీ20 గురువారం కాన్‌బెర్రా వేదికగా జరగనుంది. ఈ పర్యటనలో ఆస్ట్రేలియాతో భారత్ మూడు టీ20లతో పాటు మూడు వన్డేలు, ఏకైక టెస్ట్ మ్యాచ్ ఆడనుంది. వన్డే ప్రపంచకప్ 2025 విజయానంతరం భారత మహిళల జట్టు ఆడుతున్న తొలి ద్వైపాక్షిక సిరీస్ ఇదే.



ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
సోమవారం 16-2-2026



# మహా భారత యుద్ధం.. ఆ 18 రోజులు!

దాదాపు పదేళ్ల పాటు సాగిన రెండు ప్రపంచ యుద్ధాల్లో సుమారు రెండు కోట్ల మంది ప్రజలు, సైనికులు హతులయ్యారు.. కురుక్షేత్రంలో కేవలం 18 రోజుల్లోనే 36 లక్షల మంది చనిపోయారు.. మన ప్రపంచ యుద్ధాలు జరిగినట్లు పదేళ్ల పాటు జరిగితే భూమి మీద ప్రాణి అంటూ మిగులుతుందా? అసలు భూగోళమే ఉంటుందా? ఇంతమందిని మృత్యువాత పడేసేంత శక్తి కురుపాండవులకు ఉందా? వారి దగ్గర ఉన్న శక్తి సంపద ఏమిటి? కురుక్షేత్ర యుద్ధంలో ఎవరు ఎంత సత్తా చూపించారు? అంటే.. ఇరుపక్షాల నుంచి పాల్గొన్న సైన్యం 18 అక్షౌహిణులు. యుద్ధం జరిగిన రోజులు 18.. అంతా 18 చుట్టూనే భారతమంతా తిరిగింది. యుద్ధం జరిగిన 18 రోజుల్లో ఏరోజు ఏం చోటు చేసుకుంది..?

(..తరువాయి భాగం)

క్రీస్తు పూర్వం 3153, జూన్ 17....
కౌరవ పాండవుల మధ్య జూదం
క్రీస్తుపూర్వం 3153, జూలై 3....
పాండవుల అరణ్యవాసం ప్రారంభం
క్రీస్తు పూర్వం 3141, జూలై 3..
అజ్ఞాత వాసం ప్రారంభం సంవత్సరం తరువాత
సమాప్తమైన అజ్ఞాతవాసం
క్రీస్తుపూర్వం 3139, కృష్ణుడి శాంతి చర్చలు
విఫలం క్రీస్తుపూర్వం 3138... కురుక్షేత్ర యుద్ధం

మహా భారత యుద్ధంలో ప్రధాన సన్నివేశాలు జరిగిన సమయం ఇవన్నీ.. ఇదేమీ పుక్కిటి పురాణం కాదు. భారత యుద్ధంపై ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా జరిగిన పరిశోధనల సారం ఇవి. మన పుస్తకాలు పక్కన పెట్టి వివిధ ప్రాంతాల్లో జరిగిన ఆర్కియాలజీ రీసర్చ్ ఫలితం మహాభారత కాలం. అయిదో శతాబ్దానికి చెందిన ఆర్యభట్టు మహాభారత కాలాన్ని క్రీస్తు పూర్వం 3100గా గణించాడు. ప్రొఫెసర్ సి.వి. వైద్య, ప్రొఫెసర్ ఆప్టే 3101గా భారత కాలాన్ని గణించారు. తెలుగు వాడైన కోట వెంకటాచలం మహాభారత కాలాన్ని క్రీస్తు పూర్వం 3139గా నిర్ధారించారు. పీవీ వర్తక్ మాత్రం మహాభారత యుద్ధం ప్రారంభమైన తేదీని క్రీస్తు పూర్వం 5561 అక్టోబర్ 16 అన్నారు. అయితే ఎక్కువ మంది శాస్త్రవేత్తలు మాత్రం క్రీస్తు పూర్వం 3100 నుంచి 3139నే మహాభారత కాలంగా నిర్ధారిస్తున్నారు. కోట వెంకటాచలం రాసిన 'ది ప్లాట్ ఇన్ ఇండియన్ క్రోనాలజీ' అనే గ్రంథం ఈ గణాంకాలను హేతుబద్ధంగా నిరూపిస్తున్నది. కురుక్షేత్ర యుద్ధ రంగంలో ఇప్పటికీ ఆనాటి ఆనవాళ్లు మనకు కనిపిస్తాయి.. భీష్ముడు అంపశయ్యపై తలవాల్చిన ప్రదేశం, శ్రీకృష్ణుడు అర్జునునికి గీతోపదేశం చేసిన ప్రదేశం కురుక్షేత్రంలో ఇవాల్టికీ ఉన్నాయి. కురుక్షేత్ర ప్రస్తుతం హర్యానాలో ఉంది. పాండవులు ఏలిన ఇంద్రప్రస్థం కూడా దీనికి సమీపంలోనే ఉంది. ఢిల్లీలోని కొంత ప్రాంతం, దానికి దక్షిణాన ఉన్న మిగతా ప్రాంతాలు కలిసి ఆనాడు హస్తినాపురంగా పిలిచారు. ఈ హస్తిన గద్దె కోసమే ఇంత యుద్ధం జరిగింది. ఈ గ్రేట్ వార్లో భారత ఖండంలోని అన్ని దేశాల సైన్యాలు ఏదో ఒక పక్షం వైపు చేరి పాల్గొన్నాయి. నాటి మహేంద్రగిరి, నేటి కన్యాకుమారి నుంచి నాటి గాంధారం-నేడు ఆఫ్ఘనిస్తాన్లోని కాందహార్ దాకా అన్ని రాజ్యాలు కురుపాండవ యుద్ధంలో భాగస్వాములే. మన ఆంధ్రులు సైతం కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొన్నారు.. నాడు వీరు కౌరవుల పక్షాన

నిలబడి పోరాటం చేయటం విశేషం. కురుపాండవుల వ్యవహారంలో అత్యంత కీలక పాత్ర పోషించిందీ, కింగ్ మేకర్గా ఎత్తుకు పైఎత్తులు వేసింది శ్రీకృష్ణుడే. కౌరవుల విషయంలో శకుని, కర్ణులు ఎంతగా ప్రభావితం చేసినా, కృష్ణుడే అంతా తానే అయి చక్రం తిప్పాడు. పాండవులను లేకుండా చేసేందుకు దుర్యోధనుడి అన్ని ప్లాన్లను నిర్వీర్యం చేసింది కృష్ణుడే. చివరకు కురుక్షేత్ర యుద్ధంలో తాను ఆయుధం పట్టనన్నాడు కానీ, చేయాల్సిందంతా చేశాడు. తానే ముందుండి పాండవులను విజయం వైపు తీసుకువెళ్లాడు. సూర్యోదయంతో మొదలయ్యే యుద్ధం సూర్యాస్తమయంతో పూర్తయ్యేది. రాత్రి పూట యుద్ధం చేయటం ఆనాడు నిషేధం. అంతే కాదు.. బలహీనుడిపై, ఆయుధం లేని వాడిపై, ఆడవాళ్లపై యుద్ధం చేయకూడదన్న రూల్ కూడా ఆనాడు ఉంది. శుభకృత మార్గశిర త్రయోదశి మంగళవారం నాడు కురుక్షేత్ర యుద్ధం మొదలైంది. అప్పటికి ధర్మరాజు వయస్సు 91 సంవత్సరాల రెండు నెలల తొమ్మిది రోజులు. యుద్ధం ప్రారంభానికి ముందు ఇరుపక్షాల సైన్యాలు వ్యూహా ప్రతివ్యూహాల గురించి రిహార్సల్స్ చేసి మరీ బరిలో దిగాయి. తొలినాడే అర్జునుడు శత్రువర్గాన్ని చూసి యుద్ధం చేయలేనంటూ చేతులెత్తేశాడు. దీంతో కృష్ణుడు హితబోధ చేయక తప్పలేదు. చెడు చేసినవాడు, నేరగాడు ఎలాంటి వాడైనా, బంధువైనా సరే శిక్షించాల్సిందేనని కృష్ణుడు గీతోపదేశం చేశాడు. పాండవుల వైపు ఆర్మీ చీఫ్ గా దృష్టద్యుమ్నుడు, కౌరవుల వైపు భీష్ముడు సర్వసైన్యాధ్యక్షుడిగా వ్యవహరించారు. మొదటి రోజు కౌరవులు పశ్చిమానికి ముఖం చేసి మోహరిస్తే, పాండవులు తూర్పు వైపు ముఖం చేసి మోహరించారు. చుట్టూ పెట్టని కోటలా ఏనుగులు, మధ్యలో రాజులు, వారికి ఇరువైపులా రక్షణగా ఇతర సైనిక విభాగాలు పటిష్ఠంగా కౌరవ సైన్యం నిలబడింది. అటు పాండవ సైన్యం తక్కువ కావటంతో గరుడాకారంలో ప్రత్యర్థికి ఎదురు నిలిచింది. ఆర్మీ ఛీఫ్ భీష్ముడు కావటంతో అతని వ్యవహారాలు చూసే మిలటరీ ఆఫీసర్ ఇన్చార్జ్ దుర్యోధనుడి తమ్ముడు దుశ్శాసనుడు ఉన్నాడు. మొదటి రోజు భీష్ముడు పాండవ సైన్యాన్ని ఛిన్నాభిన్నం చేసేశాడు.. పాండవుల పక్షం ఉత్తర కుమారుడితో సహా చాలామంది సైన్యాన్ని తొలిరోజే కోల్పోయింది.

రెండవ రోజు అర్జునుడు రియలైజ్ అయి, భీష్ముడి ధాటిని నిలువరించే ప్రయత్నం చేశాడు.. అటు భీముడిపైకి దుర్యోధనుడు కళింగ సైన్యాలను పంపించాడు. రెండో రోజు కౌరవ సైన్యం తీవ్రంగా నష్టపోయింది. పాండవుల వైపు కేవలం ఏడు అక్షౌహిణుల సైన్యమే ఉంది. ఇందులో ఒకటిన్నర అక్షౌహిణుల సైన్యాన్ని అంటే దాదాపు మూడు లక్షల మంది సైనికులను భీష్ముడొక్కడే హతమార్చాడు. జీవ రసాయన ఆయుధాలను ప్రయోగిం చాడు. వార్హెడ్ మిస్సైళ్లను కూడా భీష్ముడు ఉపయోగించాడు కాబట్టే, అతని చేతిలో భారీ వినాశనం జరిగింది. మూడో రోజున భీముడి కొడుకు ఘటోత్కచుడు యుద్ధంలో ఎంటర్ అయి ఎయిర్ బ్యాటిల్ చేశాడు. నాలుగో రోజున ఘటోత్కచుడు దుర్యోధనుడి సోదరులను చాలామందిని హతమార్చాడు. అయితే భీష్ముడి ధాటిని మాత్రం పాండవులు ఎదుర్కోలేకపోయారు.. అయిదో రోజు నుంచి పదో రోజు దాకా పాండవ సైన్యం భీష్మ ద్రోణుల కారణంగా తీవ్రంగా నష్టపోయింది. శత్రువు బలవంతుడైనప్పుడు అతని బలహీనత ఏదో కనుక్కొని దాని ద్వారా కార్యం సాధించాలన్నట్లు, ఓ హిజ్రా(శిఖండి)ను అర్జునుడి రథం ముందు నిలబెట్టి భీష్ముడిని అర్జునుడి ద్వారా అంపశయ్యపైకి పంపించాడు కృష్ణుడు. హిజ్రాలతో యుద్ధం చేయకూడదన్నది పితామహుడు తనకు తాను విధించుకున్న మారటోరియం. పది రోజుల పాటు ఊహించిన దాని కంటే వేగంగా కౌరవులకు గెలుపు దిశగా సాగిన యుద్ధం, ఒక్కసారిగా డౌన్ ఫాల్ కావటం మొదలుపెట్టింది. ఈ యుద్ధంలో చెప్పుకోదగ్గ విశేషాలు చాలానే కనిపిస్తాయి. రణరంగంలో అన్ని వైపుల నుంచీ ఇరుపక్షాల ఆర్మీ వింగ్స్ శత్రువుపై అందివచ్చిన పద్ధతిలో యుద్ధం చేస్తూ వచ్చాయి. అందుకే కురుక్షేత్రంలో పలుచోట్ల బాంబుపేలుళ్లు జరిగిన ఆధారాలు కనిపిస్తాయి. అంతే కాకుండా తొలి మూడు, నాలుగు రోజుల్లో జరిగిన యుద్ధంలో ఎగిరే రథాలతో వార్ జరిగినట్లు తెలుస్తోంది.

'మహా భారత యుద్ధం.. ఆ 18 రోజులు' - మొదటి భాగం కోసం స్కాన్ చేయండి

పదో రోజున భీష్ముడు అంపశయ్యపై పడిపోయిన తరువాత 11వ రోజున ఆయన పదవిని ద్రోణాచార్యుడు తీసుకున్నాడు. ఇతని పద్మవ్యూహంలోనే అభిమన్యుడు చిక్కుకుపోయాడు. కురుక్షేత్ర యుద్ధంలో 13వ రోజున అభిమన్యుడు చనిపోయాడు. అప్పటికి అభిమన్యుడి వయస్సు కేవలం 32 సంవత్సరాలే. అంతే కాదు.. అతను ఉత్తరతో వివాహ జీవితం గడిపింది కేవలం ఆరు మాసాలే. అప్పటికి ఆమె గర్భవతి కూడా. ఈమె కొడుకే పరీక్షిత్తు.. పాండవుల తరువాత రాజయ్యాడు. అభిమన్యుడి మరణం తర్వాత అర్జునుడు చెలరేగిపోయాడు. 14వ రోజున సైంధవుణ్ణి హతమార్చటమే కాదు.. మహా మారణాయుధాలతో అయిదు అక్షౌహిణుల సైన్యాన్ని ఒక్కపూటే మట్టుపెట్టాడు. దాదాపు పదకొండు లక్షల మంది కౌరవ సైన్యం ఒకే ఒక్కరోజు నాశనమైంది. అంటే అర్జునుడు ఎంత శక్తిమంతమైన మారణాయుధాలను ప్రయోగించాడో అర్థం చేసుకోవచ్చు. ద్రోణాచార్యుడు కురుపాండవులందరికీ గురువు.. అతని ధాటికి పాండవుల సైన్యంలో ఒక అక్షౌహిణి అంటే సుమారు రెండు లక్షల మంది మృత్యువాత పడ్డారు. కురుక్షేత్ర యుద్ధం మొదలైన 15వ రోజున ద్రోణాచార్యుని ద్రౌపది తమ్ముడు దృష్టద్యుమ్నుడు హతమార్చాడు. ఇందుకోసం ధర్మరాజు అబద్ధం కూడా ఆడాల్సి వచ్చింది. అదే రోజు.. అంటే 16వ రోజున ఆర్మీచీఫ్ గా దుర్యోధనుడి మిత్రుడు కర్ణుడు బాధ్యతలు చేపట్టాడు. అర్జునుడు తప్ప, మిగతా నలుగురు పాండవులు కర్ణుడి ముందు కాసేపు కూడా నిలవలేకపోయారు. కర్ణుడి ధాటికి రెండున్నర అక్షౌహిణుల పాండవ సైన్యం హతమైంది. అంటే సుమారు అయిదు లక్షల మంది అన్నమాట. అర్జునుడితో సమానంగా మారణాయుధాలు ప్రయోగించిన వాడు కురుక్షేత్ర యుద్ధంలో కర్ణుడొక్కడే. విష సర్పాలను సైన్యంలోకి వదిలాడు. మత్తు గాలులను, బాష్ప వాయువును, వాతావరణంలోకి వెదజల్లాడు.. పాండవ సైన్యాన్ని చెల్లాచెదరు చేశాడు. ఘటోత్కచుని అంతం చేశాడు.

అప్పటికే అర్జునుడు సుమారు ఏడు అక్షౌహిణుల కౌరవ సైన్యాన్ని హతమార్చాడు. మిగతా పాండవులు మూడు అక్షౌహిణుల సైన్యాన్ని పర లోకాలకు పంపించారు. పదహారో రోజున భీముడు దుశ్శాసనుని అతి కిరాతకంగా చంపాడు.. అతని రక్తాన్ని తాగాడు.. చివరకు కర్ణుడి రథం భూమిలోకి కుంగిపోయిన సమయంలో అదను చూసి అర్జునుడు అతణ్ణి చంపాడు. కర్ణుడి చావుతో కౌరవుల వైపు మహావీరులు పరంపర ముగిసినట్లయింది. కర్ణుడి చావు తరువాత అర్జునుడు దుర్యోధనుడి సైనిక క్యాంపులపైన, శిక్షణా కేంద్రాలపైన సింధూలోయలో దొరికిన ఆర్కియాలజీ ఆధారాలు చెప్తున్నాయి. కౌరవుల రాజధాని వైమానిక దాడులు చేశాడు. ఈ సందర్భంలోనే అణ్వాయుధాన్ని ఆయన ఉపయోగించినట్లు హస్తినాపురం అప్పటికే పాక్షికంగా ధ్వంసమైంది. కౌరవులకు ఓటమి దాదాపు ఖరారైంది. అంతా పోయిన తరువాత కూడా దుర్యోధనుడు ఓటమిని అంగీకరించలేదు. కర్ణుడు సైన్యాధ్యక్షుడిగా ఉన్నది రెండున్నర రోజులే. ఆ తరువాత శల్యుడు ఆ స్థానాన్ని చేపట్టినా, ఒక్క పూట మాత్రమే రణరంగంలో నిలవగలిగాడు. శల్యుని ధర్మరాజే స్వయంగా హతమార్చాడు. అదే రోజున శకునిని సహదేవుడు చంపాడు. దీంతో దుర్యోధనుడు నీటి లోపలికి వెళ్లి దాక్కున్నాడు. పాండవులు అతణ్ణి వెతికి పట్టుకుని భీముడితో ముఖాముఖి మల్లయుద్ధం చేయించారు. ఈ యుద్ధానికి బలరాముడు రెఫరీగా వ్యవహరించాడు.. ఈ పోరాటంలో దుర్యోధనుడు తీవ్రంగా గాయపడ్డాడు.. ఒక రోజు తరువాత అతను చనిపోయాడు. మహా భారత యుద్ధం ప్రారంభానికి మూడు రోజుల ముందే సంపూర్ణ సూర్య గ్రహణం సంభవించింది. తరువాత యుద్ధం ప్రారంభమైన పదోరోజున అంటే భీష్ముడు గాయపడిన రోజున మరో గ్రహణం వచ్చింది.. పదహారో రోజున మూడో గ్రహణం వచ్చింది. చాలా తక్కువ వ్యవధిలో ఇలా మూడు గ్రహణాలు రావటం మంచి శకునం కాదంటారు. మహాభారత మారణహోమం అందుకే జరిగిందని విశ్వసించేవారూ ఉన్నారు.. ఏమైతేనేం.. 18 రోజుల మహాయుద్ధంలో ఇరు పక్షాల సైన్యం సమూలంగా హతమైంది. చివరకు మిగిలింది కేవలం 11 మంది మాత్రమే. పాండవుల వైపు అయిదుగురు అన్నదమ్ములతో పాటు కృష్ణుడు, సాత్యకి, యుయుత్సులు మాత్రమే మిగిలారు. కౌరవుల వైపు కృపాచార్యుడు, కృతవర్మ, అశ్వత్థామ బతికి బయటపడ్డారు. కురుక్షేత్రం ఎంత భీకరమైన యుద్ధమో చెప్పటానికి ఈ ఉదాహరణ ఒక్కటి చాలు. కనీసం గెలిచిన వారి వైపు కూడా ఎనిమిది మంది మినహా ఎవరూ మిగలకపోవటం మారణకాండ తీవ్రతకు నిదర్శనం. ఒక్క మాటలో చెప్పాలంటే కురుక్షేత్ర యుద్ధం అధికారం కోసం కాదు.. చావు కోసం జరిగినట్లు అనిపిస్తుంది. మృత్యువును కోరి కొని తెచ్చుకోవాలన్న బలమైన కోరికతోనే యుద్ధం చేశారేమో..!



కోవెల సంతోష్ కుమార్
రచయిత, 9052116463

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.